

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 24-06-2025 | సంపుటి - 24 | సంచిక - 53 | రూ : 4 | పేజీలు: 8


### ఫ్యూచర్ సిటీలో

## పెట్టుబడులు పెట్టండి

- ఇఫ్కీ ప్రతినిధులను కోరిన మంత్రి శ్రీధర్‌బాబు
- ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కంపెనీని నెలకొల్పడానికి ముందుకొచ్చిన సఫ్రాన్

**జూన్ 24, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని 'ఇండోఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ' (ఇఫ్కీ) ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఇఫ్కీ ప్రతినిధులతో తరువాయి 2లో



### 18 నెలల పాలన..

## గోల్డెన్ పీరియడ్...

- పునర్విభజన జరిగి సీట్లు పెరుగుతాయి..
- రిజర్వేషన్లతో మహిళలకు మరిన్ని సీట్లు
- సర్కారు సాధించినవి ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పీసీసీ, పీఏసీ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి




**జూన్ 24, హైదరాబాద్:** రాష్ట్రంలో గత 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్ అని, రాబోయే రోజుల్లో అనేక అవకాశాలతో పాటు.. సవాళ్లూ రాబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన పీసీసీ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ, రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. పీసీసీ సమావేశం బహిరంగంగా, పీఏసీ భేటీ అంతర్గతంగా నిర్వహించారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు తరువాయి 2లో

### జులై 1 నుంచి శ్రీశైలంలో

## 'ఉచిత స్పర్శ దర్శనం'

- రోజూ 1000 మందికి అవకాశం

**శ్రీశైలం ఆలయం :** శ్రీశైల మహాక్షేత్రంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి శ్రీమల్లికార్జునస్వామి 'ఉచిత స్పర్శ దర్శనాన్ని' పునఃప్రారంభించనున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వారంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు.. మధ్యాహ్నం 1.45 నుంచి 3.34 గంటల వరకు ఉచితంగా స్పర్శ దర్శనాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం కంప్యూటరైజ్డ్ టోకెట్ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు.

తరువాయి 2లో



### ఉగ్రవాదంపై మా వైఖరిని

## 'సిందూర్' చాటింది

- ప్రధాని మోదీ ఉద్ఘాటన




**జూన్ 24, ఢిల్లీ:** ''ఆపరేషన్ సిందూర్'' ఉగ్రవాదం పట్ల భారత్ అనుసరిస్తున్న కఠిన విధానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పేర్కొన్నారు. తమ ప్రభుత్వం దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎల్లవేళలా తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. భారత్‌లో ఉత్పత్తి అయిన ఆయుధాలు ఆపరేషన్ సిందూర్‌లో సత్తా చాటాయని చెప్పారు. ఆధ్యాత్మిక గురువైన శ్రీ నారాయణ గురువుకు, మహాత్మాగాంధీకి మధ్య జరిగిన చారిత్రక సంభాషణకు వందేళ్లు పూర్తైన సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ''భారతీయుల రక్తం చిందించిన ఉగ్రవాదులకు ఏ స్థావరమూ సురక్షితం కాదని నిరూపించాం'' అని ప్రధాని పేర్కొన్నారు. ఎలాంటి వివక్షలూ లేని బలమైన భారతావనిని కోరుకున్న నారాయణ గురువు ప్రవచించిన ఆదర్శాల ప్రాతిపదికగానే తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించే దిశగా సాగుతోందని వివరించారు. తాను సమాజంలో దోపిడీకి గురైన, వెనుకబడిన వర్గాల ప్రయోజనం కోసం ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు సామాజిక సంస్కర్త అయిన నారాయణ గురు స్ఫూర్తిగా నిలిచారని ప్రధాని అన్నారు.



### బనకచర్లపై ఎక్కడైనా

## చర్చకు సిద్ధం

- రేవంత్‌రెడ్డి.. మీ హామీలు అమలయ్యేదాకా వెంటపడుతూనే ఉంటాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**జూన్ 24, హైదరాబాద్:** 'హామీల గురించి ప్రశ్నిస్తున్నందుకే రేవంత్‌రెడ్డి మాపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. మేము సంయమనం పాటిస్తాం. మీరిచ్చిన హామీలు అమలయ్యేదాకా మీ వెంటపడుతూనే ఉంటాం. మీ అబద్ధాల పుట్టను బద్దలుకొడతాం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, భారాస

తరువాయి 2లో

## యుద్ధ విరామం...





- శాంతించిన ఇజ్రాయెల్, ఇరాన్
- కాల్పుల విరమణ ప్రకటించిన ట్రంప్
- 3 గంటల్లోనే ఇరాన్ ఉల్లంఘనకు పాల్పడిందన్న ఇజ్రాయెల్
- తమ దేశంలో నలుగురు చనిపోయారని వెల్లడి
- ప్రతి దాడుల హెచ్చరిక
- హద్దు మీరలేదన్న ఇరాన్

**జూన్ 24, వాషింగ్టన్, టెల్ అవీవ్, టెహ్రాన్:** రణరంగంగా మారిన పశ్చిమాసియా శాంతించింది. ఇజ్రాయెల్, ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారికంగా ప్రకటన చేశారు. ఆ తర్వాత యుద్ధ విమానాలు శాంతించాయి. అయితే అంగీకారం కుదిరిన 3 గంటల్లోనే ఇరాన్ తమపై క్షిపణులను ప్రయోగించిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ప్రతి దాడుల హెచ్చరికలు చేసింది. అంతేకాదు.. ఇరాన్‌పై దాడులకు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బయలుదేరాయి. అయితే ట్రంప్ హెచ్చరికలతో అవి వెనక్కి వచ్చాయి. ఇజ్రాయెల్ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. తాము కాల్పుల విరమణకు కట్టుబడి తరువాయి 2లో

### పోలవరం - బనకచర్ల

## సామరస్యంగానే సాధిద్దాం



- తెలంగాణతో ఘర్షణ వద్దు
- అవసరమైతే కేంద్ర జోక్యం కోరదాం
- గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే జలాల్నే వాడుకుంటాం
- రాజకీయ ప్రయోజనాల కోసమే తెలంగాణ పార్టీలు వివాదం చేస్తున్నాయి
- గత పదేళ్లలో వారి ప్రాజెక్టులకు మనం అభ్యంతరం చెప్పలేదు
- మంత్రివర్గ సమావేశంలో చర్చ

2లో

### నేతలపైనే కాదు..

## అనుచరులపైనా నిఘా

- ఫోన్ అక్రమ ట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావు వ్యవహార శైలి బహిర్గతం
- భారాస నాయకుల విషయంలోనూ ఇదే తీరు.

**జూన్ 24, హైదరాబాద్:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కోసం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి (ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు బృందం వ్యవహరించిన తీరు విస్తుగొలుపుతోంది. ఎవరినైనా లక్ష్యంగా చేసుకుంటే వారితోపాటు వారి అనుచరులు, డ్రైవర్లు, వ్యక్తిగత సహాయకులు, ఇంట్లో పని మనుషుల సెల్‌ఫోన్లపైనా నిఘా ఉంచిన తీరు సిట్ దర్యాప్తులో బహిర్గతమవుతోంది. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్.. ఇలా అందరిపై తరువాయి 2లో



# యుద్ధ విరామం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నామని, ఎటువంటి దాడులు చేయలేదని స్పష్టంచేసింది. మరోవైపు కాల్పుల విరమణను రష్యా అధ్యక్షుడు పుతిన్ స్వాగతించారు. సౌదీ అరేబియా, ఈజిప్టు కూడా స్వాగతించాయి.

**ముగిసిన 12 రోజుల యుద్ధం**

ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై క్షిపణులతో సోమవారం రాత్రి పరిమితంగా ఇరాన్ దాడులు చేసిన అనంతరం మంగళవారం ఉదయం కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ ప్రకటనకు, కాల్పుల విరమణ అమల్లోకి రావడానికి మధ్య ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ప్రతిగా ఇరాన్ జరిపిన దాడుల్లో నలుగురు ఇజ్రాయెలీలు మరణించారు. ట్రంప్ ప్రకటన అనంతరం.. కాల్పుల విరమణను అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. అటు యుద్ధాన్ని ఆపేసినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. 'కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. దానిని దయచేసి ఉల్లంఘించకండి' అంటూ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. ఆ వెంటనే ట్రంప్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని నెతన్యాహు ప్రకటించారు. ఉల్లంఘన జరిగితే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం అన్ని యుద్ధ లక్ష్యాలను సాధించిందని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీకి తెలిపారు. శనివారం తాము జరిపిన దాడులు ఇజ్రాయెల్‌కు ఉపయోగపడ్డాయని, దీంతో ఆ దేశం కాల్పుల విరమణకు అంగీకరించిందని శ్వేతసౌధం ప్రకటించింది. ఖతార్ ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించిందని వివరించింది. కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటన, దానిని ఉల్లంఘించిందన్న ఇజ్రాయెల్ ఆరోపణలపై ఇరాన్ స్పందించలేదు. చర్చల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భాగమయ్యారా లేదా అనేది తెలియలేదు. అయితే అంతకుముందే దాడులను నిలిపేసేందుకు సిద్ధమవుతున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. ఇరాన్ కాలమానం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు ఇజ్రాయెల్ కాల్పుల విరమణను అమల్లోకి తీసుకొచ్చిందని వెల్లడించారు.

# జులై 1 నుంచి శ్రీశైలంలో 'ఉచిత స్పర్శ దర్శనం'

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతానికి దేవస్థానం వద్ద టోకెన్లు జారీ చేస్తామని, తర్వాత ఆన్‌లైన్‌లో నమోదుచేసుకునే విధానం ప్రవేశపెడతామని తెలిపారు. టోకెన్లలో భక్తుల పేరు, ఆధార్, ఫోన్ నంబర్, క్యూఆర్ కోడ్ ఉంటాయని చెప్పారు. అవకాశాన్ని బట్టి రోజూ 1,000 నుంచి 1,200 మందికి ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని భావిస్తున్నామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది, దసరా ఉత్సవాలు, శ్రావణ, కార్తిక మాసాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో ఈ దర్శనం ఉండదని తెలిపారు.

# నేతలపైనే కాదు.. అనుచరులపైనా నిఘా...

(మొదటిపేజీ తరువాయి)

ఇదే రీతిలో వ్యవహరించినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఉదాహరణకు రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేసుకొని ఆయన సోదరుడు కొండల్‌రెడ్డిపై దృష్టి పెట్టారు. కొండల్‌రెడ్డి సన్నిహితులు సుభాష్‌రెడ్డి, కపిల్ ఫోన్ సంభాషణలనూ రహస్యంగా విన్నారు. అలాగే బండి సంజయ్ అనుచరులు బోయినపల్లి ప్రవీణ్‌రావు, తిరుపతి ఫోన్లపై నిఘా ఉంచారు. ఈటల రాజేందర్ తనయుడు నితిన్ పేరిట ఉన్న ఫోన్‌పై నిఘా పెట్టారు. అయితే ఆ ఫోన్‌ను రాజేందర్ స్వయంగా వినియోగించారు. మరోవైపు రాజేందర్ సతీమణి జమున నిర్వహించే జమున హేచరీస్ పేరిట నమోదై ఉన్న మొబైళ్లతోపాటు రాజేందర్ బంధువు, జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ గోపాల్‌రెడ్డి ఫోన్లపై నిఘా ఉంచినట్లు గుర్తించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డిని లక్ష్యంగా చేసుకొని ఆయన కుటుంబ వ్యాపార సంస్థలకు చెందిన సుమారు 40 మంది ఉద్యోగుల సెల్‌ఫోన్లపై నిఘా ఉంచారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, కేవేస్ రత్నం.. ఇలా పలువురు నేతల పట్ల ఈ తీరులోనే వ్యవహరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డిపైనా నిఘా ఉంచారు.ఎస్ఐబీ ఇచ్చిన జాబితాలో వారు సైతం...: గత భారాస ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలపైనా గురి కొనసాగింది. 2023 నవంబరు 15 నుంచి 30 వరకు 4,013 ఫోన్ నంబర్లపై నిఘా ఉంచినట్లు సిట్ గుర్తించింది. ఇందులో పొలిటికల్ ట్యాపింగ్‌కు సంబంధించి 618 నంబర్లను ఎస్ఐబీ సిట్ అధికారులకు ఇచ్చింది. ఈ జాబితాలో భారాస నేతలు సైతం ఉండటం గమనార్హం. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తదితరులపై దృష్టి పెట్టినట్లు తేలింది. మరోవైపు ప్రభాకర్‌రావు బృందం నిఘా జాబితాలో ఐఏఎస్ అధికారులు రొనాల్డ్ రాస్, గౌతమ్ కూడా ఉన్నట్లు గుర్తించారు.

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం ఆయన డా.బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం తరఫున అందిస్తున్న ప్రోత్సాహకాలను వారికి వివరించారు. ''తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే దూరదృష్టితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 30 వేల ఎకరాల్లో పీపీపీ విధానంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఈ నగరాన్ని అభివృద్ధి చేయాలన్నదే మా సంకల్పం. ఏడాదిన్నర వ్యవధిలోనే రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పరిశ్రమలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రతిభ గల మానవవనరులకు కొరత లేదు. మరింత వేగంగా.. పారదర్శకంగా అనుమతులిచ్చేందుకు టీజీఐపాస్‌ను ఏఐతో అనుసంధానానికి చర్యలు తీసుకుంటున్నాం. ఏరోస్పేస్, ఫార్మా, ఫుడ్‌ప్రాసెసింగ్, ఐటీ వంటి రంగాల్లో పలు ఫ్రెంచ్ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టాయి. సనోఫి, మోనిన్, సఫ్రాన్, క్యాప్ జెమినీ, డసాల్ట్, టెలిపెర్‌ఫార్మెన్స్, ఓపెల్లా హెల్త్ కేర్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఎమర్జింగ్ టెక్నాలజీస్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, డిజిటల్ గవర్నెన్స్, ఆగ్రోఇన్నోవేషన్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, ఫ్యూచర్ రెడీ ఎడ్యుకేషన్, సస్టెనబుల్ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో మంచి అవకాశాలున్నాయి'' అని శ్రీధర్‌బాబు సూచించారు. కార్యక్రమంలో ఇఫ్కీ నుంచి యోహాన్ సామ్యూల్, ప్రియాంక్ ప్రకాష్, నకుల్ దల్వాలా పాల్గొన్నారు.

**మరిన్ని పెట్టుబడులు**

ఫ్రెంచ్ విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు ప్రపంచస్థాయి ఉత్పాదక కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో సఫ్రాన్ జనరల్ మేనేజర్ పియరీ ఫెర్నాండెజ్ కొత్త పెట్టుబడులను ప్రతిపాదించారు. సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కంపెనీని నెలకొల్పనున్నట్టు వెల్లడించారు. రఫేల్, ఎం88 ఫైటర్ జెట్ ఇంజిన్ల నిర్వహణ, ఓవర్ హాలింగ్ పనులను సఫ్రాన్ చేపడుతుంది. దీనివల్ల వచ్చే ఏడాది చివరి నాటికి 150 కొత్త ఉద్యోగాలు లభిస్తాయని, తర్వాత దశల్లో మరో 750 ఉద్యోగాలు వస్తాయని అంచనా. రఫేల్ యుద్ధ విమానాల ఇంజిన్లకు కీలక విడిభాగాలను సఫ్రాన్ హైదరాబాద్‌లో తయారు చేసి వివిధ దేశాలకు సరఫరా చేస్తోంది. అతిపెద్ద ఏరోస్పేస్ హబ్‌గా నగరం రూపుదిద్దుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి పియరీ ఫెర్నాండెజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# 18 నెలల పాలన.. గోల్డెన్ పీరియడ్

(మొదటిపేజీ తరువాయి)

ఈ రెండు సమావేశాల్లో సీఎం ప్రసంగం వివరాలిలా ఉన్నాయి. ''దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది. సీట్లు పెరగబోతున్నాయి. మహిళా రిజర్వేషన్లతో వారికి మరిన్ని అవకాశాలు రానున్నాయి. జమిలి ఎన్నికలు తెస్తామంటున్నారు. ఇవన్నీ రాజకీయ అవకాశాలతో పాటు సవాళ్లనూ తీసుకొస్తాయి. అందుకు పార్టీ నాయకులంతా సిద్ధంగా ఉండాలి. ఆ సమయానికి సన్నద్ధంగా లేకపోతే బీఫాం మీ వద్దకు రాదు. ప్రసార సాధనాల్లో కొన్ని సహకరించవచ్చు.. మరికొన్ని సహకరించకపోవచ్చు. గత పదేళ్ల భారాస పాలనతో 18 నెలల కాంగ్రెస్ పాలనను పోల్చాలని, గ్రామాల్లో చర్చలు పెట్టాలని సవాల్ చేయండి. లెక్కలతోనే మనం జవాబు ఇద్దాం. విద్య, వైద్యం, రుణమాఫీ, రైతుభరోసా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి లెక్కలన్నీ చెప్పి.. ప్రజలను ఒప్పించి పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళదాం.

*** ఇన్‌ఛార్జి మంత్రులు విభేదాలను చక్కదిద్దాలి**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలి. ఈ ఉపఎన్నికలో తానే అభ్యర్థిని అని కొందరు ప్రకటించుకోవడం సరికాదు. పార్టీ అభ్యర్థిని నిర్ణయించిన తరువాత బాధ్యతగా తీసుకుని గెలిపించుకుందాం. పదవులు రాలేదని కొందరు గాంధీభవన్‌కు గొర్రెలతో వచ్చి ధర్నాలు చేయడమేంటి? ఏమైనా సమస్యలుంటే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి లేదా నాకు, పీసీసీ అధ్యక్షుడికి చెప్పుకొనే అవకాశం అందరికీ ఉంటుంది. అలా కాకుండా గాంధీభవన్‌కు వచ్చి ధర్నాలు చేయడం సరికాదు. ఇలాంటివి జరగకుండా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు ముందే చొరవ చూపి పార్టీలో అంతర్గత విభేదాలను సరిదిద్దాలి. పోలింగ్ కేంద్రం స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పార్టీ కమిటీలన్నిటినీ వెంటనే ఏర్పాటు చేయాలి. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లగలుగుతాం. పార్టీ నిర్మాణంపై పీసీసీ దృష్టి సారించాలి. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులిచ్చాం. మార్కెట్ కమిటీలు, దేవాలయాల కమిటీల వంటి నామినేటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన నాయకుల పేర్లను జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు ప్రతిపాదించాలి. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అనేక సామాజికాంశాలను కూడా పరిష్కరించింది.. వీటిని ప్రజలకు చెప్పడానికి నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను.

*** ఎదగడానికి పార్టీ పదవులే కీలకం**

ఏ రాజకీయ నాయకులైనా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకూ ఎదగడానికి పార్టీ వేదికలే ఉపయోగపడతాయి. వేల మంది పీసీసీ రాష్ట్ర నూతన కార్యవర్గ పదవులకు పోటీపడ్డారు. అందులో నుంచి కొందరిని ఎంపిక చేసి అవకాశమిచ్చారంటే.. వారు పార్టీని ముందుకు నడిపించడంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుగ్గా పనిచేస్తారని గుర్తించడం వల్లేనని తెలుసుకోవాలి. పీసీసీ పదవులు దక్కినవారిలో బాగా పనిచేసే వారికి.. 2029లో ఏర్పడే ప్రభుత్వంలో అవకాశాలు వస్తాయి. నేను 2018లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, 2023లో సీఎంగా బాధ్యతలు చేపట్టానంటే పార్టీ బాధ్యత నుంచే నాకు పదోన్నతి వచ్చింది. జిల్లా పార్టీ అధ్యక్షులుగా రాణించినవారు అనేకమంది ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎదిగారు. గతంలో కొందరు నేతలకు పార్టీ రాష్ట్ర అనుబంధ సంస్థల బాధ్యతలు ఇస్తామంటే అవి తమ హోదాకు తక్కువ అని, వాటిని తీసుకోం అని తిరస్కరించారు. ఆ రోజు వాటిని తీసుకుని పార్టీ కోసం పనిచేయడానికి ముందుకు వచ్చిన వారిలో 65 మందికి.. ఇప్పుడు కార్పొరేషన్ ఛైర్మన్లుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా పదవులు దక్కాయి. నిర్మలా జగ్గారెడ్డి కష్టపడినందునే పార్టీ ఆమెకు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చింది. పీసీసీ కార్యవర్గ పదవీ కాలం మూడేళ్లు మాత్రమే. 2029లో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. అప్పటిలోగా పనిచేయని వారిని బాధ్యతల నుంచి పీసీసీ అధ్యక్షుడు పక్కన పెడతారు.

*** ఆనవాయితీగా మళ్లీ మనదే గెలుపు**

కార్యకర్తలు పోటీచేసే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. వారిని గెలిపించుకునే వారికి రాష్ట్రస్థాయి పదవులు వస్తాయి. అప్పుడే పార్టీ బలోపేతమై రెండోసారి అధికారంలోకి వస్తుంది. గతంలో అన్ని పార్టీలు వరుసగా రెండేసిసార్లు అధికారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ కూడా ఇదే ఆనవాయితీతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలుస్తుంది. పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను గత భారాస ప్రభుత్వం దళారుల అడ్డాగా మార్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 60 వేల ఉద్యోగాలిచ్చాం. పేదవాడికి విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. విద్యార్థుల డైట్ ఛార్జీలు పెంచాం. గత 18 నెలల్లో రూ.1.04 లక్షల కోట్లు రైతుల కోసం ఖర్చుపెట్టిన ప్రభుత్వం మనది. ప్రతి విషయంలో కాంగ్రెస్ ఆదర్శంగా నిలిచి ముందుకెళుతోంది. కులగణన సర్వే నిర్వహించి దేశమంతా జరిగేలా కేంద్రప్రభుత్వం మెడలు వంచాం. ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తెచ్చాం. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చి అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం'' అని వివరించారు. పీసీసీ నూతన ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వారికి నియామక పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అందజేశారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, ఇతర సీనియర్ నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

*** రైతుల కోసం ఏటా రూ.70 వేల కోట్లు: భట్టి**

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఏటా రైతుల కోసం రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, తమది రైతు ప్రభుత్వమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం పీసీసీ, పీఏసీ సమావేశాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''గత ఏడాదిన్నర ప్రభుత్వ పాలనపై పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) హర్షం వ్యక్తం చేసి గోల్డెన్ పీరియడ్ అని అభినందించింది. పోలింగ్ కేంద్రం స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు పీసీసీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పీఏసీ తీర్మానించింది. సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మహిళా సంఘాలకు మొదటి సంవత్సరం లక్ష్యాన్ని మించి రూ.21,632 కోట్ల వడ్డీలేని రుణాలు అందించాం. బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం కోసం ప్రభుత్వం ఆర్టీసీకి ఇప్పటివరకు రూ.4,310 కోట్లు చెల్లించింది'' అని వివరించారు.

# పోలవరం బనకచర్ల సామరస్యంగానే సాధిద్దాం

పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వల్ల ఎవరికీ ఎలాంటి నష్టం లేకపోయినా తెలంగాణలోని పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం వివాదం సృష్టిస్తున్నాయని రాష్ట్ర మంత్రివర్గం అభిప్రాయపడింది. ఇది సున్నితమైన అంశమైనందున, తెలంగాణతో ఘర్షణాత్మక వైఖరికి వెళ్లకుండా, చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ఉభయతారకమని, కేవలం సముద్రంలోకి వృథాగా వెళ్లే జలాల్ని మాత్రమే వాడుకుంటున్నందున ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ ఉండదని ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చాలాసేపు చర్చ జరిగింది. అవసరమైతే దీనిపై కేంద్ర ప్రభుత్వ జోక్యం కోరాలని మంత్రివర్గం అభిప్రాయపడింది. 2017లో కృష్ణా జలాలపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తితే అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ వద్ద సమావేశమై సమస్యను పరిష్కరించుకున్న విషయం ప్రస్తావనకు వచ్చింది. గత పదేళ్లలో తెలంగాణలో చాలా సాగునీటి ప్రాజెక్టులు కట్టారని, వాటిలో కొన్నింటికి అనుమతులు తీసుకోకపోయినా మనం ఎలాంటి అభ్యంతరం తెలియజేయలేదన్న చర్చ జరిగింది. తెలంగాణలో చేపట్టిన కొన్ని ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతిచ్చిందని, అలాగే గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకూ అనుమతి లభిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. 'గోదావరి నుంచి సగటున ఏటా 3 వేల టీఎంసీల జలాలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. వాటిలో ఏపీ, తెలంగాణ చెరో 200 టీఎంసీల జలాలు వాడుకున్నా ఇబ్బంది లేదు. ఇది మన హక్కు కాబట్టి కేంద్ర ప్రభుత్వానికి బలంగా వాదన వినిపిద్దాం. ఉద్రిక్తతలకు, వివాదాలకు తావులేకుండా పరిష్కరించుకుందాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

*** ఏడాది తర్వాత రెవెన్యూ సమస్యలు ఉండకూడదు**

రాష్ట్రంలో ఏడాది తర్వాత రెవెన్యూ సమస్యలన్నవే ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. 'రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సీరియస్‌గా పనిచేయాలి.సాంకేతిక కారణాల్ని చూపించి, సమస్యలు పరిష్కారం కాలేదని చెబితే కుదరదు. నేను నిరంతరం ఫాలోఅప్ చేస్తాను. 24 గంటలూ అందుబాటులో ఉంటాను. పరిష్కారం దొరకని సమస్యలేమైనా ఉంటే నాతో ఎన్నిసార్లయినా మీరు మాట్లాడండి. అంతే తప్ప వాటిని పట్టించుకోకుండా వదిలేస్తామనడం సరికాదు' అని సీఎం పేర్కొన్నారు.

*** మార్చికల్లా ఎమ్మెల్యేల క్వార్టర్లు సిద్ధం చేయాలి**

రాజధాని అమరావతిలో మంత్రులు భవనాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస భవనాల టవర్ల నిర్మాణం వచ్చే మార్చిలో జరిగే బడ్జెట్ సమావేశాల నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సీఆర్‌డీఏ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు తాత్కాలిక వేదికలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని, అమరావతిలో వీలైనంత త్వరలో భారీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం లేదా ప్రైవేటు సంస్థలు కన్వెన్షన్ సెంటర్ నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

**మంత్రులు వేగం పెంచాలి**

అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో అన్ని రంగాలను గాడిలో పెట్టగలిగామని, ఇక వేగంగా దూసుకెళ్లాలని మంత్రులకు సీఎం సూచించారు. మంత్రులకు వారి శాఖలకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే, అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్లగలరని పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు వారికి కేటాయించిన జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మూడు నెలలకోసారి సమీక్షించాలన్నారు. తరచూ డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించాలని, దీనిపై త్వరలోనే షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. ప్రతి మంత్రివర్గ సమావేశంలోనూ పీ4 పురోగతిపై చర్చ జరుగుతుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఎన్ని బంగారు కుటుంబాల దత్తతకు కృషి చేశారన్న వివరాల్ని నమోదు చేస్తున్నామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆయా శాఖలవారీగా ఇచ్చిన హామీల్ని... ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించుకుని వచ్చే రెండు, మూడు మంత్రివర్గ సమావేశాల్లో వాటికి ఆమోదం తీసుకుని, అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

# బనకచర్లపై ఎక్కడైనా చర్చకు సిద్ధం

*** రేవంత్‌రెడ్డి.. మీ హామీలు అమలయ్యేదాకా వెంటపడుతూనే ఉంటాం**

*** మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్: 'హామీల గురించి ప్రశ్నిస్తున్నందుకే రేవంత్‌రెడ్డి మాపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. మేము సంయమనం పాటిస్తాం. మీరిచ్చిన హామీలు అమలయ్యేదాకా మీ వెంటపడుతూనే ఉంటాం. మీ అబద్ధాల పుట్టను బద్దలుకొడతాం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'స్థానిక ఎన్నికల్లో గెలుపుపై భరోసా లేకనే విధి లేని పరిస్థితుల్లో రైతుభరోసా వేసి తానే ఛాంపియన్ అని రేవంత్‌రెడ్డి చెబితే ఎవరు నమ్ముతారు? ఎన్నికల్లో ఇష్టారాజ్యంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడం లేదు. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుండడంతో రేవంత్‌రెడ్డి అబద్ధాలతో రోజులు నెట్టుకొస్తున్నారు. రూ.లక్ష కోట్లు కూడా ఖర్చు కాని కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని అంటుంటే ప్రపంచం నవ్వుతోంది. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎడారిగా మారితే ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఎందుకు ఉంటుంది? రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి పెరగడానికి ఒక్క చెక్‌డ్యామ్ కట్టారా? ఒక్క కాలువ తవ్వారా? కేసీఆర్.. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. రూ.2లక్షల కోట్లు ఖర్చు పెట్టి 44 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. అందుకే ధాన్యం ఉత్పత్తి 3 కోట్ల టన్నులకు చేరింది. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. రేవంత్ చేస్తున్న ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపించి తెలంగాణకు చేస్తున్న మోసాన్ని బట్టబయలు చేస్తాం. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయని మీరు ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలాయని అంటున్నారు. ఇది సబబేనా? 30లక్షల మంది కౌలు రైతులకు ఇస్తానన్న రైతుభరోసాపై సీఎం మాట్లాడాలి.

# విద్యార్థుల్లో మేధా సంపత్తిని పెంపొందించడానికి దోహదం

* **ప్రముఖ ఎన్.ఆర్.ఎస్.సి ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్.ఆర్. శ్రీనివాస్**
* **ఆర్.ఎస్. కే.హై స్కూల్ లో ఘనంగా అంతరిక్ష విజ్ఞాన అవగాహన కార్యక్రమం**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అంతరిక్ష విజ్ఞాన అవగాహన కార్యక్రమాలతో విద్యార్థుల్లో మేధా సంపత్తిని పెంపొందించడానికి దోహద పడుతుందని ప్రముఖ ఎన్.ఆర్.ఎస్.సి ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్.ఆర్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ బాపునగర్ లో గల ఆర్.ఎస్. కే.హై స్కూల్ ప్రాంగణంలో పాఠశాల చైర్మన్,కరస్పాండెంట్,ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ కే.రామేశ్వర్ రెడ్డి నేతృత్వంలో కేఐల్యాబ్స్,ఇస్రో (ఎన్.ఆర్.ఎస్.సి.) నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ సహకారంతో ఏర్పాటు చేసిన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు 2025 ఘనంగా నిర్వహించారు. స్పేస్ ఆన్ వీల్స్"కార్యక్రమ వేడుకలు సందడిగా నిర్వహించారు. మెడ్చల్ ,మల్కాజిగిరి జిల్లాలో మొట్టమొదటి సారి నిర్వహించిన అంతరిక్ష విజ్ఞాన అవగాహన కార్యక్రమం కావడం విశేషమని పలువురు మేధావులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎన్.ఆర్.ఎస్.సి ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్.ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు,ప్రజలలో ఇస్రో చేపట్టిన కార్యకలాపాలు,వాటి విజయాల గురించి అవగాహన కల్పిస్తూ .ఈ సదస్సుకు సుమారు వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో విద్యార్థుల్లో విజ్ఞానాసక్తి పెంపొందించడం,భవిష్యత్తులో వారు శాస్త్రవేత్తలుగా ఎదగాలనే ప్రేరణను కలిగించడం లక్ష్యంగా సాగిందన్నారు. ఈ సహకార కార్యక్రమం ఈ ప్రాంతంలో స్టెమ్ ఎస్.టి.ఈ. ఎం.విద్యా అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలిచిందని, ఇది విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం పట్ల ఆసక్తి,జ్ఞానం ప్రేరణ కలిగించే ఒక గొప్ప అవకాశమని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమానికి సుమారు 1000 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ టి.రాజేంద్ర ప్రసాద్, కేఐ. ల్యాబ్స్ సీఈవో.కరీం ఇమ్రాన్,పలు పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, శ్రీరాములు,దయాకర్,భూపాల్ రెడ్డి,చెప్యాల నర్సింహులు గౌడ్, బాషా,పలువురు ప్రముఖ విద్యావేత్తలు, కరస్పాండెంట్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.









## ఎమ్మెల్యేను కలిసిన నూతన మున్సిపల్ కమిషనర్లు



పటాన్ చెరు,ప్రజాస్ఫూర్తి 24: ఇటీవల జరిగిన బదిలీలలో తెల్లాపూర్, గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్లుగా బదిలీపై వచ్చిన అజయ్ కుమార్ రెడ్డి, వెంకట రామయ్యలు మంగళవారం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీల అభివృద్ధిలో కమిషనర్లది అత్యంత కీలక పాత్ర అని.. ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బాల్ రెడ్డి, సోమిరెడ్డి, మేఘా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సి.యమ్. పి.ఎఫ్ ఖాతాలు అప్డేట్ చేయండి..

* **జి .ఎం కు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు వినతి**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జి.ఎం కార్యాలయం నందు కార్మిక నాయకులు గూడెల్లి యాకయ్య అధ్యక్షతన కాంట్రాక్ట్ కార్మికుల సమక్షంలో జిఎం శాలెం రాజు కి కార్మికుల సి.యమ్. పి.ఎఫ్ ఖాతాల పై వి.వి స్టేట్ మెంట్ వివరాలు ఇవ్వాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది.మెమోరాండం ద్వారా కాంట్రాక్టు కార్మికుల మూడు సంవత్సరాలకు గాను సీ.ఎం పి.ఎఫ్ పుస్తకాలు అప్డేట్స్ , అందులో ఉన్న తప్పిదాలను సవరించడం ,వి.వి స్టేట్మెంట్ ద్వారా త్వరగా వివరాలు అందజేయాలని జి ఎం కు వివరించడం జరిగింది.. దానికి జి.యమ్ షాలెం రాజు స్పందించి ఏటీపీ సెల్ సత్యనారాయణ కి కాల్ చేసి వీరి సమస్యను సాధ్యమైనంతవరకు తొందరగా పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు, సాజిద్, అనిల్ షకీల్, రవి ,సుబ్బారావు, రాజు ,లక్ష్మయ్య , సభ్యులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు..

## ఐఏఎస్ ఆమ్రపాలికి క్యాట్‌లో ఊరట.. ఏపీ నుంచి మళ్లీ తెలంగాణకు కేటాయింపు

ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను ఆంధ్రప్రదేశ్ కేడర్ నుండి తిరిగి తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ క్యాట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామంతో ఆమె త్వరలోనే తెలంగాణ ప్రభుత్వంలో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమ్రపాలి దాదాపు నాలుగు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు వెళ్లారు. అయితే, దీనిని సవాల్ చేస్తూ, తనను తెలంగాణకు కేటాయించాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై విచారణ జరిపిన క్యాట్, ఇరుపక్షాల వాదనలు విన్నది. అనంతరం, ఆమ్రపాలి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ ఆమెకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.

## అధిక ఫీజులు వసూలుకు పాల్పడుతున్న నారాయణ విద్యాసంస్థలను బ్యాన్ చేయాలి

* **నారాయణ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆందోళన**
* **పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ లు ఉన్న రూమ్ ను సీజ్ చేసిన ఎంఈఓ శ్రీరామ్ మూర్తి.**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ పాఠశాలను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కె ఫహీమ్ దాదా డిమాండ్ చేశారు.ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ స్టేషనరీ పేరుతో బుక్ స్టాల్ ఏర్పాటు చేసుకొని లక్షలాది రూపాయలు విద్యార్థులు తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్న ఈ విషయంపై మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ఎదుట బేటాయించి ఆందోళన నిర్వహించారు. విద్యార్థి సంఘం నాయకులు చారువాణి ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి కి సమాచారం అందించారు. స్థానిక ఎంఈఓ శ్రీరామ్మూర్తి పాఠశాల వద్దకు చేరుకొని స్టేషనరీ పాఠశాల యూనిఫామ్ లు ఉంచిన రూమ్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కె ఫహీమ్ దాదా మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం తుంగలో తొక్కి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పేద విద్యార్థి తల్లిదండ్రులను ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆసరాగా చేసుకొని కాసులు వసూలుకు పాల్పడుతున్న విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలినీ,విద్యహక్కు చట్టంప్రకారం ప్రతి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ ఎస్టీ బీసీ వికలాంగులు పేదల వర్గాల విద్యార్థులకు 25% పీజి రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఈ నిబంధనలను నారాయణ పాఠశాల నిర్వాహకులు ఏ కోశానా అమలు చేయడం లేదన్నారు. (జీవో నెంబర్ 42)2010 ప్రకారం డొనేషన్లు క్యాప్టేషన్ ఫీజులు వసూలు చేయకూడదని, ఆట స్థలం తప్పనిసరిగా మున్సిపాలిటీ పరిధిలో 1000 చదరపు మీటర్లు ఉండాలని నిబంధనలు ఉన్నా ఆ నిబంధన తుంగలో తొక్కి తముష్టానుసారంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖ మాత్రం నిమ్మకు నిరత్తినట్టుగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని, విద్యాశాఖ అధికారుల అనుమతులతోనే అదనపు ఫీజులు వసూలు చేస్తున్నామని బహిరంగంగా యాజమాన్యం చెప్పడం వెనక ఆంతర్యం ఏంటని ఆయన ప్రశ్నించారు.తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి పర్మిషన్ లేనటువంటి విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చెయ్యాలని లేనిపక్షంలో దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్క అజిత్, జిల్లా ఉపాధ్యక్షులు గుండాల సుజన, ఇనపల్లి పవన్ సాయి, నాయకులు అక్కినపల్లి నాగేంద్రబాబు, వినయ్, వంశీ, మహేష్, కళ్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## నైనిక రజువాన్ ను అభినందించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్




ప్రజా స్ఫూర్తి, హైదరాబాద్ : పర్యావరణాన్ని కాపాడాలనే సదుద్దేశ్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దశరథ్ రజువా కుమార్తై, కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా ప్రకృతి హరిత దీక్ష చేపట్టడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన నైనిక రజువా ఆయనకు మొక్కను అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నతనం నుంచే మొక్కలను నాటాలి, చెట్లను పెంచాలి, పర్యావరణాన్ని కాపాడాలని నైనిక ఎంతో కృషి చేస్తుందన్నారు. తాను చేపట్టిన ఈ హరిత దీక్ష గురించి మరికొంత మందికి చెప్పి అవగాహన కల్పించడం ద్వారా వారిలోనూ చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో నైనిక రజువా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, గంపల బస్తి అధ్యక్షులు ఇస్మాయిల్, పోలీస్ భాస్కర్ రెడ్డి, రాజు గౌడ్, దుర్గా రావు, శేషు, పద్మరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

* **ప్రత్యేక రోజుల్లో మొక్కలు నాటాలి: నైనిక రజువా**

కొత్తగూడెంకు చెందిన మొక్కల రాజశేఖర్ సహాయ సహకారాలతో నేను ప్రకృతి హరిత దీక్ష తీసుకున్నాను. పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని, పచ్చని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అందరినీ వేడుకుంటున్నాం. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక రోజులలో మొక్కలు నాటడం ద్వారా కొంత వరకు పర్యావరణానికి హితం చేసినవారవుతారు. ప్రధానమంత్రి మోడీ శ్రీకారం చుట్టినటువంటి ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేను మొక్కల్ని నాటుతున్నాను. అలాగే వనంలో ఉన్న వానరాలు జనావాసాల్లోకి రాకుండా ఉండడానికి ఖాళీ ప్రదేశాలలో పండ్ల మొక్కలు నాటాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేస్తున్నాను. నాకు ప్రకృతి హరిత దీక్ష ఇచ్చి నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్న ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటర్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్, ఆల్ ఇండియా రేడియో మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ ప్రస్తావించిన వ్యక్తి అయిన కెఎన్ మొక్కల రాజశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

## నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసా నిస్తుంది

* **బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు**



కుత్బుల్లాపూర్ ప్రజాస్ఫూర్తి : నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆర్థిక భరోసానిస్తుందని బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు అన్నారు. మంగళవారం చింతల్ లోని ఎంఎల్ఏ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మంజూరైన రూ.10 లక్షల విలువైన 26 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు టిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు నాయకులు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల ఆర్థిక చేయూతనిచ్చేది ముఖ్యమంత్రి సహాయనిధి అని అన్నారు. నిరుపేదలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సుమారు 10 లక్షల రూపాయల విలువగల 26 చెక్కులను లబ్ధిదారులకు చేసినట్లు తెలిపారు ప్రతి లబ్ధిదారునికి ఆర్థిక చేయూతనిస్తూ అర్హులైన ప్రతీ ఒక్క నిరుపేదలను ఆదుకునేలా ప్రభుత్వం తరఫున ఈ సాయం ఎంతో అవసరమవుతుంది" అని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, వీరంశెట్టి, లక్ష్మణ్, పాపులు గౌడ్, విఘ్నేష్, మనోజ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

: **తహసిల్దార్ సరస్వతి**




సదాశివపేట,ప్రజాస్ఫూర్థి 24: మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని తహసిల్దార్ సరస్వతి అన్నారు. జాతీయ మాదకద్రవ్య నివారణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాడు సదాశివపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిఐ మహేష్ గౌడ్ అధ్యక్షతన మండల పరిధిలో ఆత్మకూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందికి మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక తహసీల్దార్ సరస్వతి పాల్గొని మాట్లాడారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వల్ల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సూచించారు. అనంతరం సీఐ మహేష్ గౌడ్ మాట్లాడుతూ డ్రెస్ సరఫరా చేసేవారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు

# మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యసాధనకై కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళ వారం ఎస్పీ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే ఆరోగ్య ప్రభావాలు,ఆర్థిక,సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ జిల్లా పోలీసు శాఖ తరపున నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ అమూల్య జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు.విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని అన్నారు. మత్తు పదార్థాలైన గంజాయి,డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై పడే హానికర ప్రభావాలతో పాటు ఆర్థిక నష్టాలు,సమాజంలో గుర్తింపు గౌరవం ఉండదని సూచించారు.ఈ డ్రగ్స్ నిర్మూలన కొరకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యవత,విద్యార్థులు మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే వెంటనే పోలీసులు వారికి సమాచారం అందించాలని అన్నారు.అనంతరం మిషన్ పరివర్తన్ మాదక ద్రవ్యాల సమాజ నిర్మూలనే లక్ష్యంగా తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించి డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ సైనికుల వలె పాటుపడాలన్నారు.డ్రగ్స్ నిర్మూలన సోల్జర్ గా నమోదు చేసుకోవడానికి లింక్ ద్వారా నమోదు చేసుకోవచ్చు అన్నారు. డ్రగ్స్ నిర్మూలన సోల్జర్ గా నమోదు చేసుకోవడానికి లింక్. https://docs.google.com/forms/d/e/1FAIpQLSfPTiKYR2_TpXKGYY3tHodCgPCRl2O4vT30C63XIYyAAcGs8Q/viewform?pli=1 డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా సెలబ్రిటీల మెసేజ్ లు చూచుటకు లింక్ https://qr.meqr.com/linklist/Q2AsYQqJ/show ఈ కార్యక్రమంలో డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి,సీఐ శ్రీనివాస్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,1టౌన్ సీఐ కరుణాకర్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, జూలూరుపాడు సీఐ ఇంద్రాసేనారెడ్డి, అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి,ఆర్ఐలు నరసింహారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ అన్స్ స్కూల్ వద్ద ఎమ్మెల్యే ధర్నా

*** స్కూల్ సీజ్ చేసిన ఎంఇఓ బాపిరెడ్డి**




ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ గ్రామంలో అనుమతులు లేకుండా స్కూల్ నడుపుతున్న సెయింట్ అన్స్ స్కూల్ వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ధర్నా నిర్వహించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న స్కూల్ నీ వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఎట్టకేలకు సెయింట్ అన్స్ స్కూల్ ను మంగళవారం కాప్రా ఎంఈఓ బాపిరెడ్డి సీజ్ చేసారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తో పాటు కార్పొరేటర్లు స్కూలు ఎదుట సుమారు రెండు గంటల ధర్నా చేశారు. పోలీసుల జోక్యంతో స్కూల్ లో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చలతో తోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో ఫోన్ లో మాట్లాడి స్కూలు సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి , ప్రభుదాస్ ,సాయి జెన్ శేఖర్, పండాల శివకుమార్ గౌడ్, పనగట్ల చక్రపాణి గౌడ్ , చల్లా వెంకటేష్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ విమానం బ్లాక్ బాక్స్ ను విదేశాలకు పంపలేదు

**: రామ్మోహన్ నాయుడు**



అహ్మదాబాద్లో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన బ్లాక్ బాక్స్ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపారంటూ వస్తున్న వార్తలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఖండించారు. బ్లాక్ బాక్స్ భారత్లోనే ఉందని, ఎయిర్క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దానిని పరిశీలిస్తోందని ఆయన స్పష్టం చేశారు.ఫిక్కీ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'హెలికాప్టర్స్ అండ్ స్మాల్ ఎయిర్క్రాఫ్ట్ సమ్మిట్ 2025' (హెలికాప్టర్లు, చిన్న విమానాల సదస్సు 2025) సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బ్లాక్ బాక్స్ను విదేశాలకు పంపారనేవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్ బాక్స్ భారత్లోనే ఉంది. ప్రస్తుతం దీనిని ఏఏఐబీ విచారిస్తోంది," అని ఆయన స్పష్టం చేశారు. జూన్ 12న లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 7878 డ్రీమ్లైనర్ విమానం, అహ్మదాబాద్లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సమీపంలోని ఒక హాస్టల్ కాంప్లెక్స్పై కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘోర దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 241 మంది ప్రాణాలు కోల్పోగా, ఒక ప్రయాణికుడు మాత్రమే అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద స్థలం నుంచి జూన్ 13న బ్లాక్ బాక్స్ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్ నుంచి సమాచారాన్ని వెలికితీయడానికి ఎంత సమయం పడుతుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఇది సాంకేతిక అంశమని, ఏఏఐబీ సరైన పద్ధతులను అనుసరించి విచారణ జరుపుతోందని తెలిపారు. "ఏఏఐబీని దర్యాప్తు చేయనివ్వండి, పూర్తి ప్రక్రియను అనుసరించనివ్వండి" అని ఆయన సూచించారు. ఈ దుర్ఘటన జరిగిన వెంటనే, ప్రమాద కారణాలను దర్యాప్తు చేయడానికి ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ప్రమాదానికి ముందు క్షణాల్లో ఏం జరిగిందో తెలుసుకోవడానికి బ్లాక్ బాక్స్ డీకోడింగ్ చాలా కీలకమని మంత్రి గతంలోనే పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఏఐబీ నిపుణులు బ్లాక్ బాక్స్లోని డేటాను విశ్లేషించే పనిలో నిమగ్నమై ఉన్నారు.

## దేశాల మధ్య చిచ్చుపెడుతున్న అమెరికా

*** యుద్ధాలకు స్వస్తి చెప్పి ప్రపంచ శాంతి నెలకొల్పాలి**

*** వామపక్షాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో నిరసన**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశాల మధ్య చిచ్చుపెడుతూ యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాడని వామపక్ష పార్టీల జిల్లా నేతలు ఆరోపించారు. అఖిలభారత వామపక్ష పార్టీల దేశవ్యాపిత నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి సిపిఎం కార్యాలయం మీదుగా బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, సిపిఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇరాన్ దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడికి అమెరికా ప్రోత్సహించడమే కాకుండా ఆ దేశంపై స్వయంగా బాంబుదాడులకు పూనుకుందని ఇది అంతర్జాతీయ చట్టాలను భేఖాతరు చేస్తూ ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా అమెరికా పోకడలు ఉన్నాయన్నారు. తక్షణమే యుద్ధాలకు స్వస్తి చెప్పి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని, ప్రపంచదేశాలపై అమెరికా కర్రపెత్తనాన్ని కండించాలని నాయకులు పిలుపునిచ్చారు. అమెరికా తీరుపై ప్రధాని మోడీ నోరుమెదపకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని, అమెరికాతో చేయికలిపి యుద్ధాలను మోడీ ప్రోత్సహిస్తున్నాడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, నేరెళ్ల రమేష్, బోయిన విజయకుమార్, పి సత్యనారాయణాచారి, ధర్మరాజు, గుత్తుల శ్రీనివాస్, మూడ్ గణేష్, షాహీన్, షమీమ్, శాంతి, సిపిఎం జిల్లా నాయకులు లిక్కి బాలరాజు, లక్ష్మి, సిపిఐ ఎమ్మెల్ మాస్ లైన్ జాటోతు కృష్ణ, ఉమర్, గౌని నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్కు నో చెప్పండి – సమాజాన్ని కాపాడండి"

*** టూ టౌన్ సీఐ ప్రతాప్**

*** పాలిటెక్నిక్ కళాశాల లో టూ టౌన్ పోలీసుల అవగాహన కార్యక్రమం**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజం కలిసి రావాలని "ఇది ఒక వ్యక్తిని చంపడమే కాదు, సమాజంలోని అన్ని రకాల సమస్యలకు దారితీస్తుంది. డ్రగ్కు నో చెప్పడంలో యువత అప్రమత్తంగా ఉండాలి, బాధ్యతగా ఉండాలి" అని టూ టౌన్ సీఐ ప్రతాప్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డిఎస్పీ అబ్దుల్ రహమాన్ ఆదేశాల మేరకు టూ టౌన్ సీఐ ప్రతాప్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టూ టౌన్ సీఐ ప్రతాప్ మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటుపడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోకూడదన్నారు. డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని యూత్ సోషల్ స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకుంటోందని, దీనిద్వారా విలువైన జీవితాలు నష్టపోతారని ఆయన అన్నారు. భవిష్యత్ లక్ష్యాలను ఎంచుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ తీసుకుని వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. సహనం కోల్పోయి ఇతరులపై దాడులు, హత్యలు, దొంగతనాలాంటి నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన సూచనలుపాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. స్కూళ్లు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుంటున్నా, విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ , సిబ్బంది ,టూ టౌన్ పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అది ఫేక్ వీడియో అంటారా?... జగన్పై షర్మిల ఫైర్

*** నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

*** జగన్ పర్యటనలో సింగయ్య మృతి ఘటనపై తీవ్ర ఆవేదన, బాధ్యత జగన్దేనని ఆరోపణ**

*** జగన్కు నిబంధనలు వర్తించవా అంటూ ప్రశ్నల వర్షం**



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం నాడు నెల్లూరు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె తన సోదరుడు, వైసీపీ అధ్యక్షుడు జగన్ లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రతి విషయంలోనూ జగన్ ప్రజలను వంచించారని, అధికారం చేతిలో ఉన్నప్పుడు ప్రజల వద్దకు వెళ్లని ఆయన, ఇప్పుడు ఓటమి తర్వాత జన సమీకరణ పేరుతో బల ప్రదర్శనలకు దిగుతున్నారని ఆమె మండిపడ్డారు. మాజీ సీఎం జగన్ పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన విషాద ఘటనపై షర్మిల స్పందించారు. జగన్ కారు సైడ్ బోర్డుపై నిలబడి ప్రయాణించడం మొదటి తప్పని, ఆయన షేక్ హ్యాండ్ ఇస్తున్న సమయంలోనే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన వీడియోను ఫేక్ అని ప్రచారం చేయడం అత్యంత దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. జగన్ తీరును తూర్పారబడుతూ షర్మిల, "జగన్కు ఏ నిబంధనలు, ఆంక్షలు వర్తించవా? మూడు వాహనాలకు అనుమతి ఉంటే, ఏకంగా ముప్పై వాహనాలతో వెళుతున్నారు. కార్ల కింద అమాయకులను నలిపేస్తూ, మానవత్వం గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసం?" అని తీవ్రంగా ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే ధైర్యం కూడా జగన్కు లేదని ఆమె దుయ్యబట్టారు. "రుషికొండలను ఎందుకు బోడిగా మార్చారు? మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి, మద్యం కుంభకోణానికి ఎందుకు పాల్పడ్డారు?" అంటూ జగన్పై ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తిరిగి నిలబెట్టాల్సిన అవసరం ఉందని భావించే అధిష్ఠానం తనను ఇక్కడికి పంపిందని షర్మిల తెలిపారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయి. నగర్ లో రూ.16 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించనున్న సీసీ రోడ్లను మంగళవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈస్ట్ సాయి నగర్ లోని రోడ్డు నెంబర్ 2 లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, విద్య సాగర్, కొండలరావు, అరవింద్ జగిర్దార్, సాయి, ఎ.ఇ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు చదువు తో పాటు క్రీడలు ఎంతగానో ముఖ్యం

*** శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : పిల్లలకు చదువు తో పాటు క్రీడలు ఎంతగానో ముఖ్యం అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐటీ , పరిశ్రమల, వాణిజ్యం, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎల్వి ప్రో బ్యాడ్మింటన్ అకాడమీ ని ఆయనతో పాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ , పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, సీనియర్ నాయకులు బండి రమేష్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతా ఇస్తుందన్నారు. ఎస్ఎల్వి ప్రొ బ్యాడ్మింటన్ అకాడమీ ని అన్ని హంగులతో సకల సౌజర్యాలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులకు తగిన సదుపాయాలు ఉన్నాయని, అన్ని క్రీడలకు, క్రీడాకారులకు ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడాకారులలో దాగిన సృజనాత్మకత ను బయటకి వెలుగు దీయడానికి క్రీడలు ఎంతగానో తొడపడుతుందన్నారు., ,క్రీడల తో శారీరక శ్రమ తో పాటు మానసిక ఉల్లాసం కలుగునని, పిల్లలు చదువుల తో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని అప్పుడే మంచి భావి పౌరులుగా దేశానికి సేవలు అందిస్తారన్నారు. విద్య , క్రీడల అభివృద్ధికి గాను ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం దివాలా తీస్తే.. ఆ ముగ్గురూ సంపన్నులెలా అయ్యారు: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని చెప్పారు. రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం ఇవాల్టితో పూర్తయింది. 9 రోజుల్లో 9 వేల కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుభరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "మా ప్రజాప్రభుత్వంలో మా మొదటి ప్రాధాన్యం రైతులే. రైతుల తర్వాత మహిళలు, యువత మా ప్రాధాన్యం. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ చేశాం. గత ముఖ్యమంత్రి వరి వేసుకుంటే ఉరి వేసుకోవడమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పాం. అంతేకాకుండా 48 గంటల్లో డబ్బు జమ చేశాం. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రమని గర్వంగా చెప్పుకొంటున్నాం. వ్యవసాయం అంటే.. రైతును రాజును చేయడం. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పులు మా నెత్తిన పెట్టి వెళ్లారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టడం.. కూలడం కూడా జరిగిపోయింది. కేసీఆర్,



కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వాళ్లంతా ఎలా సంపన్నులయ్యారు? కేసీఆర్ వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత వేయించారు.

కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నాం. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి చర్యలు చేపట్టాం. శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించాం. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అద్దెకు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళల చేతుల్లో పెట్టాం. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. పదేళ్ల భారాస పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలి." అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్

గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. " అసెంబ్లీలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలి. కేసీఆర్ చెప్పిన తేదీన అసెంబ్లీలో చర్చ చేపట్టే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబు తీసుకుంటారు. ఆధారాలు, సంతకాలతో అసెంబ్లీలో చర్చకు వస్తా. కేసీఆర్ సిద్ధమా?ఒకరోజు గోదావరి జలాలు, రెండో రోజు కృష్ణా జలాలపై చర్చిద్దాం. గతంలో సంతకాలు చేసిన కాగితాలు అసెంబ్లీ ముందు ఉంచుతా" అని సీఎం అన్నారు.

## తెలంగాణ లాసెట్, పీజీఎల్ సెట్ అభ్యర్థులకు కీలక అప్‌డేట్

తెలంగాణ లాసెట్, పీజీఎల్‌సెట్ (TG LAWCET & PGLCET2025) రాసిన అభ్యర్థులకు కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ప్రవేశ పరీక్షల ఫలితాలను జూన్ 25 విడుదల చేయనున్నారు. ఇటీవల ప్రాథమిక కీ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి అధికారులు బుధవారం మధ్యాహ్నం 3.30గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. మాసబ్ ట్యాంక్‌లో ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు విడుదల చేస్తారు. జూన్ 6న టీజీ ఎల్‌సెట్ అండ్ పీజీ ఎల్‌సెట్ ప్రవేశ పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. మొత్తం 57,715 మంది



దరఖాస్తు చేసుకోగా.. 45,609 మంది పరీక్ష రాశారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీకి 32,118 మంది, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎంకు 13,491 మంది అభ్యర్థులు చొప్పున హాజరయ్యారు.

## సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయేలా ఉజ్జయిని మహంకాళి బోనాలు: మంత్రి పొన్నం

హైదరాబాద్: సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరపున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు




నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ హరిచందన, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, అగ్నిమాపక, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

## మోండా మార్కెట్ జ్యువెలరీ షాప్‌లో దోపిడీ కేసు.. ఛేదించిన పోలీసులు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో ఇటీవల జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 18న మోండా మార్కెట్‌లో జ్యువెలరీ షాప్ యజమానిని ఓ ముఠా మోసం చేసి దోపిడీకి పాల్పడింది. బంగారం తక్కువ ధరకే ఇస్తామని నకిలీ బంగారం తీసుకొచ్చి రూ. 72లక్షలతో ఉడాయించారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ దోపిడీని పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నిందితుల్లో కొండాపూర్ 8వ బెటాలియన్‌కి చెందిన కానిస్టేబుల్ కేశవ్ పట్టుబడ్డాడు. ప్రధాన నిందితులు ఇద్దరిని గోవాలో అదుపులోకి తీసుకున్నారు. కేసుతో సంబంధం ఉన్న మరి కొంతమందిని కర్ణాటకలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం 18 మంది నిందితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన డబ్బును నిందితులు వివిధ మార్గాల ద్వారా తరలించి పోలీసుల దృష్టి మరల్చే ప్రయత్నం చేశారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు నిందితుల్ని అరెస్ట్ చేశారు.

## బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేస్తున్న నలుగురు ఇన్‌ఫ్లుయెన్సర్ల అరెస్టు

హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేస్తూ కమీషన్లు ఆర్జిస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లను సైబరాబాద్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. చిన్నంశెట్టి నాగ రాకేశ్, పి.దీపక్, గుగులోత్ శ్రీరామ్ నాయక్, హేమంత్ కుమార్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఏటీఎం కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ సాయి శ్రీ తెలిపారు. టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌లో నిందితులు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నట్టు



గుర్తించామన్నారు. "నిందితులకు 10వేల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. బెట్టింగ్ వల్ల ఓ యువకుడు నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. కమీషన్‌తో ఒక్కొక్కరు రూ.50లక్షలు సంపాదించినట్టు గుర్తించాం. బెట్టింగ్‌లో తెలుగు ప్రజలే లక్ష్యంగా ఈ ముఠా మోసాలకు పాల్పడుతోంది. 2019 నుంచి వీరు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. 10 విదేశీ వెబ్‌సైట్లను నిందితులు ప్రమోట్ చేస్తున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నాం" అని డీసీపీ తెలిపారు.

## హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి అరుదైన గుర్తింపు

దిల్లీ: రాజధాని దిల్లీలో జరుగుతున్న ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారుల సమావేశం 2025లో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి అరుదైన గుర్తింపు దక్కింది. 202425 మధ్య కాలానికి గానూ 'సంస్కరణలు, ప్రజా సేవపట్ల నిబద్ధత' విభాగంలో హైదరాబాద్ ఆర్పీవో (రీజినల్ పాస్‌పోర్టు ఆఫీస్) అవార్డు సాధించింది. ఈ అవార్డును మంగళవారం నిర్వహించిన 13వ పాస్‌పోర్టు సేవా దివస్ కార్యక్రమంలో విదేశాంగశాఖ సహాయమంత్రి పవిత్ర మార్గెరిటా ప్రదానం చేశారు. హైదరాబాద్ పాస్‌పోర్టు అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ




ఈ అవార్డు అందుకున్నారు. అంతేకుండా పాస్‌ఫోర్టు వెరిఫికేషన్‌లో ఉత్తమ సేవలు అందించినందుకుగానూ తెలంగాణ పోలీసు విభాగాన్ని కూడా సత్కరించారు. తెలంగాణ పోలీస్ తరపున ఇంటెలిజెన్స్ డీజీ బత్తుల శివధర్‌రెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.

## సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు: భట్టి విక్రమార్క

హైదరాబాద్: రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. "రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు




వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని చెప్పారు.

## పాలన బాగుంది.. కానీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు

* **తెలంగాణ కాంగ్రెస్ పీఏసీ భేటీలో జగ్గారెడ్డి వ్యాఖ్యలు**
* **కాంగ్రెస్ పాలన బీఆర్ఎస్ కంటే మెరుగ్గా ఉందన్న జగ్గారెడ్డి**
* **సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని వ్యాఖ్య**
* **కాంగ్రెస్ కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారని వెల్లడి**
* **కార్యకర్తలకు ఆర్థిక సాయం, గుర్తింపు ఇవ్వాలని సూచన**
* **జగ్గారెడ్డి సూచనలపై సీఎం సానుకూల స్పందన**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అయితే, ఇదే సమయంలో పార్టీ కార్యకర్తలు మాత్రం కొంత అసంతృప్తితో ఉన్నారని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జరిగిన తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో జగ్గారెడ్డి ఈ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే చాలా గొప్పగా ఉందని జగ్గారెడ్డి కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులందరూ ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. అయితే, వారి కృషి ఫలించాలంటే క్షేత్రస్థాయిలో పార్టీకి మూలస్తంభాలైన కార్యకర్తలను సంతృప్తి పరచాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ,




వారికి తగిన ఆర్థిక సహాయం అందించాలని, పార్టీ కార్యక్రమాల్లో సరైన గుర్తింపు ఇవ్వాలని జగ్గారెడ్డి పీఏసీకి సూచించారు. కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు

హైదరాబాద్: క్వారీ యజమానిని బెదిరించిన కేసులో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. వరంగల్ కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వివరించారు. సుబేదారీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ నెల 16న కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 17న విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఇవాల్టికి (మంగళవారం)వాయిదా వేసింది. ఆ లోపే 21న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వరంగల్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ముగించింది.

# విమాన దుర్ఘటనలో మృతులు 275 మంది : గుజరాత్ ప్రభుత్వం

అహ్మదాబాద్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంలో మొత్తం 275 మంది ప్రాణాలు కోల్పోయినట్లు గుజరాత్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇందులో 241 మంది ప్రయాణికులు కాగా.. 34 మంది స్థానికులు ఉన్నట్లు తెలిపింది. ప్రమాద ఘటనలో ప్రాణనష్టానికి సంబంధించి రాష్ట్ర ఆరోగ్యశాఖ తొలిసారి అధికారికంగా ఈ వివరాలను ప్రకటించింది. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్న అధికారులు.. డీఎన్ఏ పరీక్షల ద్వారా ఇప్పటివరకు 260 మందిని గుర్తించారు. మరో ఆరుగురిని మాత్రం ముఖాలతో నిర్ధరించారు. చనిపోయిన వారిలో 120 మంది పురుషులు, 124 మంది మహిళలు, 16 మంది చిన్నారులు ఉన్నారు. ఇప్పటివరకు 256 మృతదేహాలను బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతావారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని ఆరోగ్యశాఖ ప్రకటించింది. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. 11ఏ సీటులో ఉన్న ఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడగా మిగతా వారంతా ప్రాణాలు కోల్పోయారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య విద్యార్థుల వసతి భవనంపై విమానం పడటంతో అక్కడున్న పలువురు వైద్యులు సహా స్థానికులు మృతి చెందడం తీవ్ర విషాదం నింపిన విషయం తెలిసిందే. మరోవైపు ప్రమాదానికి గురైన విమానంలోని అత్యంత కీలకమైన బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషించేందుకు విదేశాలకు పంపించారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనని.. అది భారత్‌లోనే ఉందన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పూర్తి స్థాయి దర్యాప్తు జరుపుతోందన్నారు. ఇదిలా ఉంటే, ఘటనా స్థలం నుంచి విమాన శకలాలను ఎయిర్‌పోర్టుకు తరలించే ప్రక్రియ మూడోరోజు కొనసాగినట్లు అధికారులు వెల్లడించారు.






## పాన్ అప్‌డేట్ చేయకపోతే 'పోస్టల్' ఖాతా బ్లాక్ అవుతుందా? .. నిజమెంత?

పాన్ కార్డు అప్‌డేట్ చేయకపోతే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా నిలిచిపోతుందంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. కస్టమర్ పాన్ కార్డు అప్‌డేట్ కాకపోతే.. వారి పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా 24గంటల్లోగా బ్లాక్ అవుతోందంటూ కొందరు ఫేక్ సందేశాలు పెడుతున్నారని తెలిపింది. ఇలాంటి నకిలీ మెసేజ్‌ల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరుతూ పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ''ఐపీపీబీకి సంబంధించి వస్తోన్న ప్రచారంలో నిజంలేదు. ఇండియా పోస్ట్ ఆఫీస్ ఎప్పుడూ ఇలాంటి సందేశాలను పంపదు. మీ వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దు. నకిలీ లింక్‌ల పట్ల జాగ్రత్త'' అని కోరింది. ఏదైనా వార్తను నమ్మడం, వేరొకరికి షేర్ చేసే ముందు అధికారిక వర్గాల నుంచి ధ్రువీకరించుకోవాలని అధికారులు పదే పదే సూచిస్తున్న విషయం తెలిసిందే.

## 'అరిగిపోయిన టైర్లు.. పాత సాఫ్ట్‌వేర్..' విమానయాన వ్యవస్థలో లోపాలెన్నో

ఎయిరిండియా విమాన ప్రమాదంతో అప్రమత్తమైన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ దేశంలోని ప్రధాన విమానాశ్రయాలను ఇటీవల పరిశీలించింది. ఈ క్రమంలోనే విమానయాన వ్యవస్థల్లో అనేక లోపాలున్నాయని గుర్తించినట్లు తెలిపింది. విమానాలు, రన్‌వేల్లో లోపాలు వంటివీ ఇందులో ఉన్నాయని ఓ ప్రకటనలో తెలిపింది. డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలోని రెండు బృందాలు ఇటీవల దిల్లీ, ముంబయి సహా దేశంలోని ఆయా ప్రధాన విమానాశ్రయాల్లో సమగ్ర పరిశీలనలు నిర్వహించాయి. ఫ్లైట్ ఆపరేషన్స్, ర్యాంప్ సేఫ్టీ, ఎయిర్ ట్రాఫిక్



కంట్రోల్, కమ్యూనికేషన్, నేవిగేషన్ సిస్టమ్స్, ప్రీఫ్లైట్ మెడికల్ ఎవాల్యూయేషన్స్ తదితర అంశాలను క్షుణ్నంగా పరిశీలించాయి. ఓ ఎయిర్‌పోర్ట్‌లో అరిగిపోయిన టైర్ల కారణంగా ఓ దేశీయ విమానం నిలిచిపోయినట్లు అధికారులు గుర్తించారు. విమానాల్లో లోపాలు అనేకసార్లు పునరావృతమైన కేసులు వెలుగుచూశాయని డీజీసీఏ తెలిపింది. ఒక చోట సిమ్యులేటర్.. విమానం కాన్ఫిగరేషన్‌తో సరిపోలడం లేదని, సాఫ్ట్‌వేర్ ప్రస్తుత వెర్షన్‌కు అప్‌డేట్‌గా లేదని గుర్తించినట్లు వెల్లడించింది. పకడ్బందీ పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంలో లోపాలను ఇవి సూచిస్తున్నాయని పేర్కొంది. లోపాలు వెలుగుచూసిన విమానయాన సంస్థలు, ఇతరవాటి వివరాలు డీజీసీఏ వెల్లడించలేదు. అయితే.. దిద్దుబాటు చర్యలు తీసుకునేలా సంబంధిత లోపాల గురించి సమాచారం అందించామని తెలిపింది.

## 'సిందూర్'లో పనిచేశారని.. భార్య హత్య కేసులో రక్షణ ఇవ్వలేం: సుప్రీంకోర్టు

దిల్లీ: వరకట్నం కోసం భార్యను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో ఓ ఎన్ఎస్‌జీ కమాండో చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తాను 'ఆపరేషన్ సిందూర్'లో పనిచేసినందుకు.. ఈ కేసులో మినహాయింపు కల్పించాలని ఆ కమాండో అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన కోర్టు.. ఆ కారణంతో కేసు నుంచి రక్షణ ఇవ్వలేమని స్పష్టం చేసింది. అసలేం జరిగిందంటే..నేషనల్ సెక్యూరిటీ గార్డ్‌లోని బ్లాక్ క్యాట్ కమాండో యూనిట్‌లో పనిచేస్తున్న ఓ కమాండోపై హత్య అభియోగాలు ఉన్నాయి. వరకట్నం కోసం తన భార్యను చంపినట్లు ఆరోపణలు రావడంతో కేసు నమోదైంది. దీనిపై పంజాబ్‌లోని ఓ ట్రయల్ కోర్టు 2004లో విచారణ జరిపి ఆయనను దోషిగా తేల్చింది. 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. కమాండో అభ్యర్థనను తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం.. జైలు శిక్షను సమర్థించింది. దీంతో ఆయన హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ''నేను బ్లాక్ క్యాట్ కమాండోను. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నా. ఈ కేసులో లొంగిపోకుండా నాకు మినహాయింపు కల్పించండి'' అని అభ్యర్థించారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ''ఆ కారణాన్ని



చూపి ఇంట్లో జరిగిన దారుణ ఘటన నుంచి మీరు రక్షణ కోరలేరు. ఇది చాలా దారుణమైన ఘటన. ఇందులో మీకు మినహాయింపులు కల్పించలేం'' అని స్పష్టం చేసింది. వెంటనే లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, ఇందుకు కొంతసమయం కావాలని పిటిషనర్ కోరగా.. రెండు వారాల గడువు ఇచ్చింది.

## 'రాహుల్ గాంధీ రహస్య విదేశీ యాత్ర'... బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

* **రాహుల్ గాంధీ లండన్ పర్యటనపై రాజకీయ వివాదం**
* **మేనకోడలి గ్రాడ్యుయేషన్ కోసమే వెళ్లారని కాంగ్రెస్ స్పష్టీకరణ**
* **రాహుల్ తరచూ విదేశీ పర్యటనలపై బీజేపీ ఐటీ చీఫ్ మాలవీయ విమర్శ**
* **ప్రతిపక్ష నేతగా వివరాలు చెప్పాలని డిమాండ్**
* **ప్రధానమంత్రి కార్యాలయం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆరోపణ**
* **త్వరలోనే రాహుల్ తిరిగి వస్తారని కాంగ్రెస్ ప్రకటన**



కాంగ్రెస్ అగ్రనేత, రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ విదేశీ పర్యటన మరోసారి రాజకీయ దుమారానికి దారితీసింది. ఆయన ప్రస్తుతం లండన్‌లో ఉన్నారని, తన మేనకోడలి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారని కాంగ్రెస్ పార్టీ మంగళవారం వెల్లడించింది. అయితే, రాహుల్ గాంధీ తరచూ విదేశాలకు వెళ్లడంపై, ఆ వివరాలు గోప్యంగా ఉంచడంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ పరిణామంతో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ, రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల తీరును తప్పుబడుతూ ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. "రాహుల్ గాంధీ గత వారమే ఓ రహస్య విదేశీ పర్యటన ముగించుకువచ్చారు. ఇప్పుడు మళ్లీ మరో అజ్ఞాత ప్రదేశానికి విదేశాలకు వెళ్లారు" అని మాలవీయ తన పోస్ట్‌లో ఆరోపించారు. " ఈ తరచూ అదృశ్యమవ్వడాలు ఎందుకు? దేశానికి దూరంగా ఆయనను అంతగా ఆకర్షిస్తున్న విషయం ఏమిటి? లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా, భారత ప్రజలకు ఆయన ఈ విషయాలపై సమాధానం చెప్పి తీరాలి" అని అమిత్ మాలవీయ డిమాండ్ చేశారు. అమిత్ మాలవీయ చేసిన విమర్శలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, బీజేపీ ఆరోపణలను ఖండిస్తూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)పై ఎదురుదాడికి దిగారు. "ప్రధానమంత్రి కార్యాలయం ఎప్పటిలాగే తన నీచమైన కుయుక్తులకు పాల్పడుతోంది. వారికి అంతకు మించి ఏమీ తెలియదు" అని పవన్ ఖేరా ఎక్స్ వేదికగా మండిపడ్డారు. "రాహుల్ గాంధీ తన మేనకోడలి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు లండన్ వెళ్లారు. త్వరలోనే ఆయన తిరిగి వస్తారు" అని ఖేరా స్పష్టం చేశారు. ప్రియాంక గాంధీ వాద్రా, రాబర్ట్ వాద్రాల కుమార్తె మిరాయా వాద్రా యూకేలో తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం జరుగుతోందని తెలిసింది. రాహుల్ గాంధీ న్యూఢిల్లీ నుంచి బహ్రెయిన్ మీదుగా లండన్ వెళ్లినట్లు కాంగ్రెస్ వర్గాలు కూడా ధృవీకరించాయి.

## అక్రమంగా ప్రవేశిస్తే.. నిర్బంధం, బహిష్కరణ తప్పదు – US ఎంబసీ హెచ్చరిక

వలసదారులకు సంబంధించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మరోసారి అలర్ట్ జారీ చేసింది. అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తే నిర్బంధం, బహిష్కరణతోపాటు భవిష్యత్తులోనూ శాశ్వతంగా వీసాకు అనర్హులవుతారని హెచ్చరించింది. దేశంలోకి అక్రమంగా వస్తే జైలు శిక్షతోపాటు బహిష్కరణ వేటు తప్పదని స్పష్టం చేసింది. భారీ ఖర్చు పెట్టి, ప్రమాదకర మార్గాల్లో వచ్చినా జైలు శిక్ష లేదా స్వదేశానికి తిప్పిపంపించడమే కాకుండా శాశ్వత ముద్ర పడిపోతుందని తెలిపింది. అమెరికా వచ్చే విద్యార్థులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్న భారత్‌లోని అమెరికా రాయబార కేంద్రం.. వీసా అనేది ఓ ప్రివిలేజ్ మాత్రమేనని, అది హక్కు కాదని చెబుతోంది.




వీసా (US Visa) జారీ చేసిన తర్వాత కూడా స్క్రీనింగ్ ఉంటుందని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే అధికారులు ఆ వీసాను రద్దు చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. అంతేకాకుండా స్టూడెంట్ (Student visa) లేదా పర్యటక వీసాపై (Visitor visa) వెళ్లేవారు మాదకద్రవ్యాలు తీసుకోవడం లేదా అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే భవిష్యత్తులో అమెరికా వీసాకు అనర్హులవుతారని ఉద్ఘాటించింది.

## రాజస్థాన్ లో 3,500 ఏళ్ల నాటి పురాతన నది ఆనవాళ్లు!

రాజస్థాన్‌లోని దీగ్ జిల్లా బహాజ్ గ్రామంలో భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) జరిపిన తవ్వకాల్లో ఓ అద్భుత ఆవిష్కరణ వెలుగుచూసింది. భూమికి 23 మీటర్ల లోతున ఒక ప్రాచీన నది ప్రవాహ మార్గం (పాలియో ఛానల్) బయటపడింది. ఇది వేదాల్లో ప్రస్తావించిన సరస్వతీ నది జాడలు కావచ్చని, భారత పురావస్తు చరిత్రలోనే ఇది అపూర్వమైన ఆవిష్కరణ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ 2024 నుంచి ఈ ఏడాది మే వరకు సాగిన ఈ తవ్వకాల్లో క్రీస్తుపూర్వం 3500 నుంచి 1000 మధ్య కాలంలో ఇక్కడ నాగరికత విలసిల్లినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. "ఈ ప్రాచీన నదీ వ్యవస్థ ఆనాటి మానవ ఆవాసాలకు జీవనాధారంగా నిలిచి, బహాజ్ గ్రామాన్ని విస్తృతమైన సరస్వతీ నదీ పరివాహక సంస్కృతితో కలుపుతుంది" అని ఏఎస్ఐ జైపూర్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ వినయ్ గుప్తా తెలిపారు. కుషానులు, మగధ, శుంగ వంశాల కాలంనాటి అవశేషాలు కూడా ఇక్కడ లభ్యమయ్యాయి. తవ్వకాల్లో మట్టి స్తంభాల నివాస గృహాలు, పొరలుపొరలుగా ఉన్న గోడల కందకాలు, కొలిమిలు, వివిధ ఇనుప, రాగి వస్తువులు బయల్పడ్డాయి. సూక్ష్మశిలా పరికరాలు హోలోసీన్ పూర్వ కాలం నుంచే ఇక్కడ మానవ ఉనికిని సూచిస్తున్నాయి. క్రీ.పూ. 1000 నాటి 15 యజ్ఞకుండాలు, శక్తి ఆరాధన మొక్కుబడి చెరువులు, శివపార్వతుల మట్టి విగ్రహాలు ఆధ్యాత్మిక జీవనానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా, బ్రాహ్మీ లిపి అక్షరాలున్న నాలుగు కాల్చని ముద్రికలు (సీలింగ్స్) లభించాయి. ఇవి భారత ఉపఖండంలో బ్రాహ్మీ లిపికి సంబంధించిన అత్యంత పురాతన, కాలాన్ని నిర్ధారించదగిన ఆధారాలు కావచ్చని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. మహాజనపదాల కాలం నాటి యజ్ఞకుండాలలో అక్షరాలు లేని రాగి నాణేలు దొరకడం, నాణేల ఆవిర్భావ చరిత్రపై కొత్త వెలుగునిచ్చే అవకాశముంది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### 158 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. ఇరాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ వార్తలు మార్కెట్‌కు మద్దతునిచ్చాయి. సెన్సెక్స్ 158 పాయింట్లు పెరగగా, నిఫ్టీ 25వేల పాయింట్ల మార్క్‌కు ఎగువన ముగిసింది. చివరలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో స్వల్పంగా తగ్గాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే 82,534.61 పాయింట్ల వద్ద లాభాల్లో ముగిసింది. ఇంట్రాడేలో 81,900.12 పాయింట్ల కనిష్టానికి తగ్గిన సెన్సెక్స్.. 83,018.16 గరిష్టంగా పాయింట్లకు పెరిగింది.

చివరకు 158.32 పాయింట్ల నష్టంతో 82,055.11 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 72.45 పాయింట్లు పెరిగి 25,044.35 పాయింట్లకు చేరుకుంది. నిఫ్టీలో జియో ఫైనాన్సియల్, అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, గ్రాసిమ్, కొటక్ మహీంద్రా, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్ అత్యధిక లాభాలను ఆర్జించాయి. ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ, మారుతి సుజూకీ, హెచ్‌టీసీ, భారత్ ఎలక్ట్రికల్ నష్టాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే పీఎస్‌యూ బ్యాంక్ 1.5 శాతం లాభపడగా.. నిఫ్టీ మెటల్ ఒకశాతం శాతం పెరిగింది. నిఫ్టీ బ్యాంక్, ఆటో, ప్రైవేట్ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ కూడా 0.7 శాతం పెరిగాయి. నిఫ్టీ మీడియా ఒకశాతం శాతం పడిపోయాయి.

## ఖాతాదారులకు గుడ్‌న్యూస్ చెప్పిన ఈపీఎఫ్‌వో..

### ఆటో సెటిల్‌మెంట్ రూ.5లక్షలకు పెంపు..!



**న్యూఢిల్లీ:** ఖాతాదారులకు ఈపీఎఫ్‌వో శుభవార్త చెప్పింది. అడ్వాన్స్‌డ్ క్లెయిమ్స్ కోసం ఆటో సెటిల్‌మెంట్‌ను రూ.లక్షలను రూ.5లక్షలు పెంచింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం వెల్లడించారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ఖాతాదారులకు వేగంగా ఆర్థిక సహాయం అందించడానికి ఈపీఎఫ్‌వో తొలిసారిగా ముందస్తు క్లెయిమ్స్ ఆటో-సెటిల్‌మెంట్‌ను ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. అత్యవసర సమయాల్లో క్లెయిమ్స్ చేసే ఈపీఎఫ్‌వో సభ్యులకు లబ్ధి చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మరో శుభవార్త చెప్పింది. క్లెయిమ్ మరింత సులభతరం చేసింది. గతంలో క్లెయిమ్స్ సమయాల్లో క్యాన్సల్డ్ చెక్, పాస్‌బుక్ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండేది. ప్రస్తుతం చెక్, పాస్‌బుక్ ఫొటోలు అప్‌డేట్ చేయాల్సిన అవసరం లేదని కార్మికశాఖ 'ఎక్స్' సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా వెల్లడించింది.

క్లెయిమ్‌లను కొన్ని క్లిక్‌లలోనే సమర్పించవచ్చని.. వేగవంతమైన, ఇబ్బంది లేకుండా.. మీ సమయాన్ని ఆదా చేసేందుకు ఈ విధానం రూపొందించినట్లు కార్మిక శాఖ పేర్కొంది. సాధారణ క్లెయిమ్స్‌ను వేగంగా సెటిల్ చేసేందుకు ఆటో ప్రాసెసింగ్‌ను ఈపీఎఫ్ఓ తీసుకొచ్చింది. మానవ ప్రమేయం లేకుండానే క్లెయిమ్స్‌ను పరిష్కరించడమే ఈ ఆటో సెటిల్‌మెంట్ దీని ఉద్దేశం. వివాహం, ఉన్నత విద్య, గృహాల కొనుగోలు కోసం ఈపీఎఫ్ ఆటో సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని తీసుకువచ్చింది. సాయంతో ఇకపై రూ.5లక్షల వరకు వేగంగా క్లెయిమ్ చేసుకునే వీలుంటుంది. ఆటో సెటిల్‌మెంట్ కారణంగా రూ.5 లక్ష వరకు ఎలాంటి క్లెయిమ్స్ వేగంగా పరిష్కారమవుతాయి. ఆటో సెటిల్‌మెంట్ ఐటీ వ్యవస్థ ఆధారంగా పని చేయనుండగా.. కేవైసీ, బ్యాంక్ వ్యాలిడేషన్ పూర్తయితే ఐటీ టూల్స్ పేమెంట్‌ను ఆటోమేటిక్‌గా ప్రాసెస్ ప్రక్రియ జరుపుతాయి. గతంలో సెటిల్‌మెంట్ పది రోజుల వరకు సమయం పట్టగా.. ప్రస్తుతం మూడు నాలుగు రోజుల్లోనే క్లెయిమ్స్ సెటిల్ అవుతాయి.

## హార్లే డేవిడ్సన్ లవర్స్‌కు శుభవార్త

### అదిరే ఫీచర్స్‌తో నయా బైక్ రిలీజ్



**న్యూఢిల్లీ:** మోటారు సైకిళ్లను ఇష్టపడే వారందరికీ హార్లే డేవిడ్సన్ బైక్ లు సుపరిచితమే. సాధారణ బైక్ లతో పోల్చితే వీటి ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. దీంతో చాలామంది రైడర్లు తమ జీవితంలో ఒక్కసారైనా వాటిని నడపాలని కోరుకుంటారు. డిజైన్, లుక్, సామర్థ్యం, నాణ్యత పరంగా హార్లే డేవిడ్సన్ బైక్ లు ఎప్పుడూ ముందు స్థానంలో ఉంటాయి. వీటిపై కూర్చుని డ్రైవింగ్ చేస్తుంటే ఒకరకమైన రాజసం కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ కంపెనీ తన 2025 మోడళ్లను అధికారికంగా విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న షోరూమ్ లలో ప్రీ బుకింగ్ లు కూడా మొదలయ్యాయి.

ప్రముఖ టూ వీలర్ కంపెనీ హీరో మోటాకార్ప్ తో హార్లే డేవిడ్సన్ కు భాగస్వామ్యం కొనసాగుతోంది. ప్రస్తుతం మన దేశంలో విడుదల చేయనున్న వాహనాలపై మార్కెట్ లో ఆసక్తి నెలకొంది. వీటిలో ఎంట్రి లెవల్ అయిన ఎక్స్ 440 ధరను రూ.2.39 లక్షలుగా నిర్దారణ చేశారు. ఇక 2025 మోడళ్లలకు సంబంధించి నైట్ స్టర్ రూ.13.51 లక్షలు, నైట్ స్టర్ స్పెషన్ రూ.14.29 లక్షలు, స్పోర్ట్ స్టర్ ఎస్ రూ.16.70 లక్షలు పలుకుతున్నాయి. హెరిటేజ్ క్లాసిక్ రూ.23.85 లక్షలు, ఫ్యాట్ బోయ్ రూ.25.90 లక్షలు, పాన్ అమెరికా స్పెషల్ రూ.25.10 లక్షలు, బ్రేక్ అవుట్ రూ.37.19 లక్షలుగా ప్రకటించారు. ఇక సీవీవో మోడల్స్ లోని స్ట్రీట్ గ్లైడ్, రోడ్ గ్లైడ్ లను త్వరలోనే ప్రారంభించనున్నారు. వాటి ధరలు కూడా వెల్లడించాల్సి ఉంది.

హార్లే డేవిడ్సన్ తన కొత్త లైనప్ మోడళ్లను అనేక అనేక ప్రత్యేకతలతో తీసుకువచ్చింది. ముఖ్యంగా డిజైన్ ను ఛాలా ఆకర్షణీయంగా రూపొందించింది. పాత లైనప్ కు కొన్ని మార్పులు చేసి ఆధునాతనంగా మార్పులు చేసింది. ఇంజిన్, లుక్, టెక్నాలజీలపై శ్రద్ధ చూపింది. రైడర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు, డ్రైవింగ్ సులభం చేసేందుకు కొత్త టెక్ ఫీచర్లను తీసుకువచ్చింది. ఈ కొత్త బైక్ లపై మార్కెట్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ తరహా మోడళ్లకు మన దేశంలో ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో హార్లే డేవిడ్సన్ మార్కెట్ లో ఇతర వాహనాలకు మంచి పోటీ ఇస్తుందని భావిస్తున్నారు.

# లీడ్స్ టెస్టులో టీమిండియా చరిత్ర

**93 ఏళ్ల టెస్ట్ క్రికెట్‌లో అరుదైన ఘనత!**

**ఒకే టెస్ట్ మ్యాచ్‌లో ఐదు సెంచరీలు నమోదు**

**భారత్ 93 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి**

**టెస్ట్ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన ఆరో జట్టుగా భారత్**

**విదేశీ గడ్డపై ఈ రికార్డు అందుకున్న రెండో జట్టు టీమిండియా**

**లీడ్స్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న లీడ్స్ టెస్టులో భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. తమ 93 ఏళ్ల టెస్ట్ క్రికెట్ ప్రస్థానంలో (1932లో తొలి టెస్ట్ ఆడింది) ఒకే టెస్ట్ మ్యాచ్‌లో ఏకంగా ఐదు సెంచరీలు నమోదు చేయడం ఇదే తొలిసారి. ఈ మ్యాచ్ భారత బ్యాటర్లకు పరుగుల పండుగలా మారింది.

తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (159 బంతుల్లో 101 పరుగులు, 16 ఫోర్లు), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (227 బంతుల్లో 147 పరుగులు, 19 ఫోర్లు, ఒక సిక్స్), రిషబ్ పంత్ (178





బంతుల్లో 134 పరుగులు, 12 ఫోర్లు, ఆరు సిక్సర్లు) శతకాలతో కదం తొక్కారు. వీరి అద్భుత బ్యాటింగ్‌తో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగుల భారీ స్కోరు సాధించింది.

అనంతరం ఇంగ్లండ్ కూడా దీటుగా బదులివ్వడంతో భారత్‌కు కేవలం ఆరు పరుగుల స్వల్ప ఆధిక్యం మాత్రమే లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ చేజార్చుకున్న కేఎల్ రాహుల్, రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత శతకం (137)తో ఆ లోటును భర్తీ చేసుకున్నాడు. మరోవైపు రిషభ్ పంత్ కూడా మరో సెంచరీ (140 బంతుల్లో 118 పరుగులు, 15 ఫోర్లు, మూడు సిక్సర్లు) సాధించి, ఒకే టెస్టులో రెండు శతకాలు బాదిన తొలి భారత వికెట్ కీపర్ బ్యాటర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పాడు.

కేఎల్ రాహుల్‌తో కలిసి పంత్ కీలకమైన 195 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఇన్నింగ్స్‌ను పటిష్ఠం చేశాడు.

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక జట్టు ఒకే మ్యాచ్‌లో ఐదు సెంచరీలు చేయడం ఇది కేవలం ఆరోసారి మాత్రమే. కాగా, విదేశీ గడ్డపై ఈ ఘనత సాధించిన రెండో జట్టుగా భారత్ నిలిచింది. ఇంతకుముందు 1955లో కింగ్‌స్టన్‌లో వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా ఈ ఫీట్ సాధించింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్లు కోలిన్ మెక్‌డొనాల్డ్ (127), నీల్ హార్వే (204), కీత్ మిల్లర్ (109), రాన్ ఆర్చర్ (128), రిచీ బెనాడ్ (121) ఒకే ఇన్నింగ్స్‌లో ఐదు సెంచరీలు సాధించారు. దాంతో ఆసీస్ 758/8 వద్ద డిక్లేర్డ్ చేసింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ తేడాతో గెలుపొందింది.

కాగా, భారత్, ఇంగ్లాండ్ మ్యాచ్ విషయానికొస్తే, 371 పరుగుల లక్ష్య ఛేదనలో ఆతిథ్య జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 350 పరుగులు చేయాల్సి ఉంది. గిల్ సేన గెలవాలంటే పది వికెట్లు పడగొట్టాలి. దీంతో చివరి రోజు ఆటపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



## పంత్‌ను తప్పుపట్టిన ఐసీసీ.. అతని ఖాతాలోకి ఓ డీమెరిట్ పాయింట్



**లీడ్స్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మూడవ రోజు రిషబ్ పంత్ అంపైర్లతో అనుచితంగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో ఐసీసీ అతనిపై చర్యలు తీసుకున్నది. అంపైర్ల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన కారణంగా.. అంతర్జాతీయ క్రికెట్ మండలి అతన్ని మందలించింది. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలతో చెలరేగిన పంత్.. ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో సరైన రీతిలో ప్రవర్తించలేదని ఐసీసీ తెలిపింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్ 1 నేరానికి పాల్పడినట్లు ఐసీసీ పేర్కొన్నది. అంతర్జాతీయ మ్యాచుల్లో అంపైర్ల పట్ల సరైన ప్రవర్తన కలిగి ఉండకపోవడాన్ని లెవల్ 1 అఫెన్స్‌గా చూస్తారు. ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.8 ఉల్లంఘించినట్లు ఐసీసీ చెప్పింది. క్రమశిక్షణా చర్యల కింద పంత్‌కు ఓ డీమెరిట్ పాయింట్ జోడించారు. గడిచిన 24 నెలల్లో అతను తొలిసారి క్రమశిక్షణా కోడ్‌ను ఉల్లంఘించాడు.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 61వ ఓవర్‌లో హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. బంతి కండీషన్‌పై ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో పంత్ చర్చించాడు. బాల్‌ను మార్చేందుకు అంపైర్లు నిరాకరించడంతో రిషబ్ పంత్ ఆగ్రహంతో తన చేతుల్లో ఉన్న బంతిని నేలకు కొట్టేశాడు. తప్పును ఒప్పుకొన్ని పంత్.. ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రచర్డ్‌సన్ విధించిన ఆంక్షలను ఆమోదించాడు.

## మాజీ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూత



**ముంబై:** టీమిండియా మాజీ క్రికెటర్, ఆఫ్ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూశారు. ఆయన వయసు 77 ఏళ్లు. లండన్‌లో ఆయన గుండె సంబంధిత వ్యాధితో మరణించారు. కొన్ని దశాబ్ధాల నుంచి ఆయన లండన్‌లోనే నివాసం ఉంటున్నారు. టీమిండియా తరపున 33 టెస్టులు ఆడిన దిలీప్.. 114 వికెట్లు తీసుకున్నాడు. అయిదేసి వికెట్లు అతను ఆరు సార్లు తీసుకున్నాడు. 15 వన్డేల్లో అతను 22 వికెట్లు తీసుకున్నాడు. సౌరాష్ట్ర, బెంగాల్, వార్‌విక్‌షైర్, నాటింగ్‌హామ్‌షైర్‌కు అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు.

1970 దశకంలో ఉన్న మేటి స్పిన్నర్ల దారిలో దిలీప్ దోషి ముందుకు సాగాడు. అతను 32 ఏళ్ల వయసులో టెస్టు అరంగేట్రం చేశాడు. నాటింగ్‌హామ్‌షైర్‌లో లెజండరీ గ్యారీఫీల్డ్ సోబర్స్‌తో కలిసి ఆడేవాడు. 1980 దశకంలో అతను స్వల్ప సమయంలోనే క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. ఆ దశలో ఇండియన్ క్రికెట్ నడుస్తున్న తీరును ఆయన ఇష్టపడలేదు. స్పిన్ పంచ్ పేరుతో ఆటోబయోగ్రఫీ బుక్ రాశాడతను. దాంట్లో క్రికెట్ అనుభవాల గురించి చెప్పాడు.

# రింకూ సింగ్ పెళ్లి వాయిదా..

**న్యూఢిల్లీ:** భారత క్రికెటర్ రింగూ సింగ్.. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్.. ఇటీవల నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఇద్దరి పెళ్లి నవంబర్ 19వ తేదీన జరగాల్సి ఉంది. కానీ ఆ పెళ్లి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇటీవల లక్నోలో చాలా గ్రాండ్‌గా ఎంగేజ్మెంట్ సెర్మనీ జరిగింది. ఆ వేడుకకు మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, నటి జయా బచ్చన్, భువనేశ్వర్ హాజరయ్యారు.

ఓ హిందీ పత్రిక ప్రకారం.. నవంబర్‌లో క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉన్న కారణంగా.. రింకూ తన పెళ్లిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇరువురికి చెందిన కుటుంబాలు ఆ వాయిదాకు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రింకూ, సరోజ్ పెళ్లి జరిగే అవకాశాలు ఉన్నాయి. తుది తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

పెళ్లి కోసం వారణాసిలోని తాజ్ హొటల్‌ను తొలుత బుక్ చేసుకున్నారు. కానీ క్రికెట్ కమిట్‌మెంట్ వల్ల ఆ పెళ్లి వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. ఆ హొటల్‌ను ఇప్పుడ ఫిబ్రవరి చివరినాటికి బుక్ చేసుకున్నారు. జూన్ 8వ తేదీన ఇద్దరి మధ్య రింగ్ సెర్మనీ జరిగింది. టీ20 స్పెషలిస్టు రింకూ.. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ఆడుతాడు. ప్రియా సరోజ్ .. ఎస్పీ టికెట్‌పై మచిలీషహర్ నుంచి గెలుపొందారు.



# హిందీలో మజ్దూర్‌గా వస్తున్న రజనీకాంత్




**టాకీస్:** తలైవా రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా ఇది. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. అగ్ర నటులు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహీర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగష్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి తాజాగా హిందీలో టైటిల్‌ను మార్చారు మేకర్స్. హిందీలో ఈ సినిమాను 'మజ్దూర్' అనే పేరుతో తీసుకురాబోతున్నట్లు సమాచారం. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు అని అర్థం. అయితే కూలీ అనే టైటిల్ బాగానే ఉన్నప్పటికి పేరు మార్చడంపై చాలా మంది నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గతంలో వచ్చిన అమితాబ్ బచ్చన్ కూలీ (1983), గోవిందా కూలీ నెం. 1 (1995), వరుణ్ ధావన్ కూలీ నెం. 1 (2020) వంటి చిత్రాల కాపీరైట్ సమస్యల వల్లే ఈ పేరు మార్పు జరిగిందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.

## అందాల ఇస్మార్ట్ బటర్‌ప్లై 'నభా నటేష్'




**టాకీస్:** ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ముద్దుగుమ్మ నభా నటేష్ ఈ మధ్య కాలంలో కాస్త స్లో అయింది. గత ఏడాది 'డార్లింగ్' అనే వెబ్ మూవీతో వచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. ప్రస్తుతానికి ఈమె పెద్దగా సినిమాలు ఏమీ చేయడం లేదు. ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయని తెలుస్తోంది. ఆ సినిమాలు ఎప్పటికి కన్ఫర్మ్ అయ్యేది క్లారిటీ లేదు. వచ్చే ఏడాదిలో ఈ అమ్మడు తన సినిమాలతో వస్తానంటూ ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ధీమాగా చెప్పుకొచ్చింది. నభా నటేష్ సినిమా ఆఫర్ల సంగతి పక్కన పెడితే రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇంత అందమైన నభా నటేష్‌కి ఆఫర్లు రావడం లేదు పాపం అంటూ నెటిజన్స్ ఎప్పుడూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఉంటారు. తాజాగా మరోసారి తన ఫాలోవర్స్‌తో పాటు అంతా కూడా అబ్బ నభా అంటూ చూపు తిప్పుకోనివ్వకుండా చూసే విధంగా అందమైన ఫోటో షూట్‌ను షేర్ చేసింది. బ్లూ నెట్టెడ్ డ్రెస్‌లో కనిపించిన ఈ అమ్మడు కవ్విస్తోంది. క్లీ వేజ్ షో తో మతి పోగొడుతున్న ఈ అమ్మడు మళ్లీ మళ్లీ తిరిగి చూసే విధంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సాదారణంగానే నభా నటేష్ అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా అందంగా నభా కనిపిస్తుంది అంటూ అభిమానులతో పాటు అంతా కామెంట్స్ చేస్తున్నారు.

సింపుల్ మేకోవర్‌తో, సింపుల్ ఔట్ ఫిట్‌లో నభా నటేష్ ఆకట్టుకుంది. సింప్లీ సూపర్ అనే విధంగా ఉన్న నభా నటేష్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కరోనా ముందు వరకు ఈ అమ్మడు వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంది. ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత ఇండస్ట్రీలో ఈ అమ్మడు బిజీ అవుతుందని అంతా భావించారు. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఈ అమ్మడికి కరోనా కారణంగా ఆఫర్లు దక్కలేదు. ఏడాది పాటు పెద్దగా సినిమాలు చేయక పోవడం వల్ల ఆఫర్లు తగ్గాయి. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా మళ్లీ సినిమా ఇండస్ట్రీలో బిజీ కావాలని ప్రయత్నాలు చేస్తుంది. అది ఎంతవరకు సాధ్యం అనేది చూడాలి. కర్ణాటకలోని ఉడిపిలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఈ అమ్మడు జాతీయ అవార్డ్ గ్రహీత ప్రకాష్ బెలవాడి ఆధ్వర్యంలో నాటకాల్లో నటించింది. అంతే కాకుండా మోడలింగ్ తోనూ ఇండస్ట్రీలో గుర్తింపు దక్కించుకుంది. కాలేజ్ రోజుల్లోనే భరతనాట్యం శిక్షణ పొందడం వల్ల ఈ అమ్మడికి డాన్స్‌లో మంచి ప్రావిణ్యం దక్కింది. ఇండస్ట్రీలో ఎంతో మంది హీరోయిన్స్‌తో పోల్చితే నభా నటేష్ అద్భుతమైన డాన్సర్‌గా గుర్తింపు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు కొత్త సినిమాల కోసం వెయిట్ చేస్తుంది. ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఒక సినిమా అయినా కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## నవీన్ చంద్ర షో టైమ్ ట్రైలర్ విడుదల



**టాకీస్:** టాలీవుడ్ యువ నటుడు నవీన్ చంద్ర, పోలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'షో టైమ్'. ఈ సినిమాకు మదన్ దక్షిణామూర్తి దర్శకత్వం వహిస్తుండగా.. నరేష్, రాజా రవీంద్ర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అనుకోకుండా మర్డర్ చేసిన నవీన్ చంద్ర కామాక్షి దంపతులు.. ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డారు అనే కథతో ఈ సినిమా రాబోతుంది.

## అనుపమ మూవీకి సెన్సార్ కష్టాలు



**టాకీస్:** మలయాళ నటులు అనుపమ పరమేశ్వరన్, కేంద్రమంత్రి సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను కాస్మోస్ ఎంటర్‌టైనమెంట్స్ నిర్మిస్తుండగా.. శృతి రామచంద్రన్, మాధవ్ సురేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూన్ 27 ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ అభ్యంతరం వలన సినిమా వాయిదా పడినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో బాధితురాలి పాత్రకు జానకి అని దైవ సంబంధమైన పేరుని పెట్టడంపై ముంబై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో జానకి అనే పేరుతో ఓ మహిళ అత్యాచార బాధితురాలిగా న్యాయపోరాటం చేస్తుందని, అయితే 'జానకి' అనేది సీతాదేవికి మరో పేరు కావడంతో, అలాంటి పేరును అత్యాచార బాధితురాలికి పెట్టకూడదని సెన్సార్ బోర్డు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందిస్తూ, జూన్ 27న విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడిందని ధృవీకరించారు. ఈ నిర్ణయంపై మలయాళ సినీ పరిశ్రమలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్నికృష్ణన్ సెన్సార్ బోర్డు నిర్ణయాన్ని విమర్శించారు. దేవుళ్ల పేర్లు కలిగిన పాత్రలకు ఇటువంటి నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందని, ఇది కళాత్మక స్వేచ్ఛను అడ్డుకుంటుందని ఆయన అన్నారు. ఇలాంటి నిబంధనలు ఉంటే, హిందూ మతానికి చెందిన పాత్రలకు పేర్లు ఎంపిక చేసుకోవడం చాలా కష్టమవుతుందని ఆయన ప్రశ్నించారు. తిరువనంతపురంలోని ప్రాంతీయ సెన్సార్ కార్యాలయం ఈ చిత్రానికి సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, ముంబైలోని ప్రధాన కార్యాలయం ఈ టైటిల్‌ను మార్చాలని డిమాండ్ చేయడంతో ఈ సమస్య తలెత్తింది. పేరు మార్చాల్సి వస్తే, సినిమాలోని అనేక సంభాషణలను కూడా మార్చాల్సి వస్తుందని మేకర్స్ ఆందోళన చెందుతున్నారు.



## మీనాకుమారి బయోపిక్‌లో కియారా అద్వానీ

టాకీస్: బాలీవుడ్‌లో మళ్లీ బయోపిక్‌ల ట్రెండ్ జోరుగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మరో బయెపిక్ తెరమీదకి రాబోతుంది. దివంగత నటి, 'ట్రాజెడీ క్వీన్' గా ప్రసిద్ధి చెందిన మీనా కుమారి జీవితం ఆధారంగా ఒక బయోపిక్ రాబోతున్నట్లు తెలుస్తుండగా.. ఈ చిత్రంలో కియారా అద్వాణీ మీనాకుమారి పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అలనాటి 'ట్రాజెడీ క్వీన్' మీనా కుమారి గురించి సినీ ప్రియులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'బైజుబాన్రా', 'పాకీజా' వంటి క్లాసిక్ చిత్రాలతో భారతీయ సినిమా చరిత్రలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు మీనా కుమారి. ఆమె జీవితంలో దాగి ఉన్న భావోద్వేగాలు, బాధలు, కీర్తి, ప్రేమ.. ఇలా అన్నీ వెండితెరపై మరోసారి ప్రతిభావంతంగా ఆవిష్కరిం చేందుకు బాలీవుడ్ సిద్ధమవుతోంది. ఈ భారీ బయోపిక్‌కు ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించబోతున్నట్లు సమాచారం. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మనీష్, ఇప్పుడు సినిమా దర్శకత్వంలో అరంగేట్రం చేయనుండగా, ఆయన తొలి చిత్రమే 'మీనా కుమారి' బయోపిక్ కావడం విశేషం. తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రతిష్టాత్మక బయోపిక్‌లో కియారా అద్వాణీనే కథానాయికగా ఎంపికైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మీనా కుమారి పాత్రలో నటించేందుకు పలువురు హీరోయిన్‌లు ఆసక్తి చూపినప్పటికీ, ఆ పాత్రకు అవసరమైన భావోద్వేగం, విలువ, గంభీరత కియారా నుంచే రావచ్చని చిత్ర బృందం బలంగా నమ్ముతోందట. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశలో ఉన్నాయని, దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని కియారా సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

## 'గేమ్ ఛేంజర్' నా కెరీర్‌లోనే పెద్ద గుణపాఠం

### అగ్ర నిర్మాత దిల్ రాజు

**టాకీస్:** అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం తమ్ముడు. నితిన్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రానికి వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తుండగా.. సీనియర్ నటి లయ కీలక పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రం జూలై 04న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు నిర్మాత దిల్ రాజు. అయితే ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆయన నిర్మాణంలో వచ్చి డిజాస్టర్ అందుకున్న రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.

'గేమ్ ఛేంజర్' తన కెరీర్‌లో ఒక "తప్పుడు నిర్ణయం" అని దిల్ రాజు అంగీకరించారు. శంకర్ లాంటి పెద్ద దర్శకులతో పనిచేయడం ఇదే తన మొదటి అనుభవం అని.. ఇది తనకు ఒక పెద్ద గుణపాఠం అని ఆయన పేర్కొన్నారు. పెద్ద సినిమాలు, పెద్ద దర్శకులతో చేసినప్పుడు 100 శాతం సమస్యలు వస్తాయి. ఇది దిల్ రాజుకే కాదు, అందరికీ ఎదురయ్యే సమస్య అని ఆయన వ్యాఖ్యానించారు.

దర్శకుడు శంకర్ విషయంలో తన ప్రమేయం లేకుండానే చాలా పనులు జరిగిపోయాయని, సినిమా మేకింగ్ తన నియంత్రణలో లేదని పరోక్షంగా సూచించారు. 'గేమ్ ఛేంజర్' సినిమా తొలి కట్ నాలుగున్నర గంటలకు పైగా వచ్చిందని, ఎడిటర్ కూడా ఈ విషయాన్ని చెప్పారని దిల్ రాజు అంగీకరించారు. పెద్ద డైరెక్టర్లతో పని చేస్తున్నప్పుడు ఎక్కువగా జోక్యం చేసుకోలేమని, కానీ తప్పు జరిగినప్పుడు నిర్మాతగా దాన్ని ఆపాల్సిన బాధ్యత తనదేనని, ఆ విషయంలో తాను విఫలమయ్యానని ఒప్పుకున్నారు. 'గేమ్ ఛేంజర్' వంటి భారీ ప్రాజెక్టుకు అసలు గ్రీన్ లైట్ ఇచ్చి ఉండకూడదని, ఇది తన పొరపాటేనని దిల్ రాజు పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. సినిమాను చివరి నిమిషం వరకు తాను చూడలేదన్న వార్తలను ఖండిస్తూ, తాను ముందే సినిమా చూశానని స్పష్టం చేశారు. మొత్తం మీద,



'గేమ్ ఛేంజర్' పరాజయం పట్ల దిల్ రాజు నిరాశను వ్యక్తం చేస్తూ, కొన్ని విషయాలలో తన నియంత్రణ లేకపోవడమే ఈ పరిస్థితికి దారితీసిందని పేర్కొన్నారు. పెద్ద దర్శకులతో సినిమా తీసేటప్పుడు ముందే స్పష్టమైన నిబంధనలతో కాంట్రాక్ట్ చేసుకోవాలని, తాను అలా చేయకపోవడం ఒక పొరపాటని ఆయన అభిప్రాయపడ్డారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.